ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 131, పేజీలు - 08

గురువారం, నవంబర్ 12, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

తెలంగాణలో విద్యా విప్లవానికి శ్రీకారం

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి 10+2 విధానం అమలు

- నర్సరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు సమూల మార్పులు - 12వ తరగతి నుంచే నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

- ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు





హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ప్రస్తుత కాలానికి అనుగుణంగా విద్యా విధానాన్ని ఆధునికీకరించి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వచ్చే విద్యా సంవత్సరం (2027-28) నుంచి రాష్ట్రంలో 10+2 విద్యా విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యాశాఖపై బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. నర్సరీ నుంచి 10+2 విధానాన్ని అమలు చేసేందుకు అవసరమైన కార్యాచరణను వేగవంతం చేయాలని ఆదేశించారు. కొత్త విధానం అమలులో ఏ ఒక్క విద్యార్థికీ నష్టం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నేటి అవసరాలకు తగినట్లుగా విద్యా విధానంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని, నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రాథమిక ప్రాధాన్యతని సీఎం పేర్కొన్నారు.

తరగతుల వారీగా విద్యా విభజన

నూతన విద్యా విధానంలో భాగంగా

2లో..

ముద్రా, ఎరువుల సబ్సిడీలకు ఆమోదం

- కేంద్ర కేబినెట్ 5 కీలక నిర్ణయాలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) దేశంలో సాంస్కృతిక వారసత్వం, పట్టణ రవాణా, రైతుల సంక్షేమం, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన కేంద్ర కేబినెట్ మీటింగ్ లో 5 ప్రధాన నిర్ణయాలకు ఆమోదం తెలిపింది. న్యూదిల్లీలో భారీ మ్యూజియం ఏర్పాటు, నోయిడా మెట్రో విస్తరణ, రబీ సీజన్‌కు ఎరువుల సబ్సిడీలతో పాటు చిన్న వ్యాపారాలు, మహిళలకు రుణ హామీ పథకాల పొడిగింపు ఈ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలలో ఉన్నాయి.

2లో..

విదేశీ శక్తులకు వేదికగా కాంగ్రెస్ సదస్సు

- హైదరాబాద్‌లో భారత్ సమ్మిట్ కాదు.. యాంటీ భారత్ సమ్మిట్

- రాహుల్ గాంధీని మళ్లీ రాజకీయంగా లాంచ్ చేసేందుకే ఈ సదస్సు

- బీజేపీ తెలంగాణ చీఫ్ రాంచందర్ రావు తీవ్ర విమర్శలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ నిర్వహిస్తున్న 'భారత్ సమ్మిట్'పై బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్ర విమర్శలు చేశారు.ఇది అసలు భారత్ సమ్మిట్ కాదని, పక్కా 'యాంటీ భారత్ సమ్మిట్' అని అభివర్ణించారు. భారతదేశానికి వ్యతిరేకంగా కుట్రలు చేసే విదేశీ శక్తులకు ఈ సదస్సు వేదికగా మారుతోందని ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న దేశాలు, వ్యక్తులు 'ప్రోగ్రెసివ్ అలయెన్స్' పేరుతో ఒక కూటమిగా

2లో..

ప్రపంచ రాజకీయాలకు వేదికగా హైదరాబాద్

- దావోస్ తరహాలో భాగ్యనగరం అభివృద్ధి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరాన్ని ప్రపంచ రాజకీయ, సామాజిక, ఆర్థిక చర్చలకు మరో అంతర్జాతీయ వేదికగా తీర్చిదిద్దుతున్నామని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య, అహింస, ప్రగతిశీల భావజాలాన్ని విశ్వసించి ముందుకు సాగుతుందన్నారు. గత ఏడాది నిర్వహించిన భారత్ సమ్మిట్‌కు

2లో..

36 సాగునీటి ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలి

- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

అమరావతి (ప్రశ్న న్యూస్) వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి కారణంగా రాష్ట్రంలో నిర్వీర్యమైన ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి జూన్ నాటికి వాటి ద్వారా నీరు విడుదల చేసేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఖరీఫ్‌కు పునరుద్ధరణ పరిధిలో ఉన్న 789 ఎత్తిపోతల పథకాల మరమ్మతులన్నీ ఎట్టిపరిస్థితుల్లోనూ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో వాటి స్థితిగతులను పరిశీలించి, వెంటనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ, నిర్వహణ, ఇరిగేషన్ భూముల్లో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటు తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం క్యాంప్ కార్యాలయంలో సమీక్షించారు.36 సాగునీటి ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలి అని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

జలహారతి కార్పొరేషన్ ద్వారా నిరంతర పర్యవేక్షణ

రాష్ట్రంలో 789 ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు రూ.632.07



కోట్లు అవసరమవుతాయని అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి వివరించారు. వీటి పునరుద్ధరణ ద్వారా 7.49 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీటి సదుపాయం కల్పించవచ్చని తెలిపారు. ఇక ఎత్తిపోతల పథకాల నిర్వహణకు పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. ఎత్తిపోతల పథకాల పర్యవేక్షణ బాధ్యతను జలహారతి కార్పొరేషన్ ద్వారా

2లో..

విజయసాయిరెడ్డి సారథ్యంలో 'పరివర్తన రాజనీతి పార్టీ' ఆవిర్భావం

- కొత్త పార్టీ జెండాను ఆవిష్కరించిన విజయసాయి

- రెండు కుటుంబాల ఆధిపత్యానికి చెక్

- రాజకీయాల్లో మార్పులకు శ్రీకారం చుట్టాం



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఏ ఒక్క నేత చేతుల్లోనో, రెండు కుటుంబాల చేతుల్లోనో బంధీ కాకూడదని నూతన రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టినట్లు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కుటుంబ పాలనకు, అహంకారపు నాయకత్వానికి స్పష్టి పలకడమే ఈ పార్టీ ప్రధాన లక్ష్యం అన్నారు. తన రాజకీయ పార్టీ పేరు పరివర్తన రాజనీతి పార్టీ అని విజయవాడ వేదికగా ప్రకటించారు. అనంతరం విజయసాయిరెడ్డి మాట్లాడుతూ పదవులు, వారసత్వాలు తాత తండ్రుల నుండి కాకుండా కష్టం, అనుభవం ద్వారా సాధించుకోవచ్చని తన జీవితమే నిరూపించిందన్నారు.

2లో..

కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థులు డాక్టర్ నలమాస శ్రీకాంత్ గౌడ్, ఆకాశ్ కొల్లూరితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఫ్యూజ్ ఎగిరిపోయిందని వ్యాఖ్యానించిన కవిత.. కొత్త తరాన్ని ప్రోత్సహించాల్సిన బాధ్యత రైతన్నలపై ఉందన్నారు. పొలంలో ఫ్యూజ్ ఎగిరిపోతే రైతులు కొత్త ఫ్యూజ్ వేసినట్లుగానే, రాజకీయాల్లోనూ కొత్తవారికి అవకాశం కల్పించాలని పిలుపునిచ్చారు. అధికార పార్టీకి, నిద్రావస్థలో ఉన్న ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పేందుకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను విద్యావంతులు అవకాశంగా మలుచుకోవాలని అన్నారు. హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ స్థానం నుంచి ఆకాశ్ కొల్లూరిని, నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానం నుంచి డాక్టర్ శ్రీకాంత్ గౌడ్‌ను గెలిపించాలని కోరారు.

2లో..

హైదరాబాద్‌ను సరికొత్తగా తీర్చిదిద్దడమే లక్ష్యం

3లో..

- తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి



నా గడ్డంపైనే వాళ్లకు ఫికర్

- కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ కౌంటర్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) నిర్మల్‌లో జరిగిన బీఆర్ఎస్ రైతు గర్జన సభ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మల్ సరస్వతి మాత కొలువుదీరిన పుణ్యభూమి అని అన్నారు. ఈ చారిత్రక ప్రదేశానికి, కేసీఆర్ ఉద్యమానికి అవినాభావ సంబంధం ఉందని చెప్పారు. ప్రత్యేక రాష్ట్రం వస్తుందని మొదట చెప్పింది ఇక్కడేనని కేటీఆర్ గుర్తుచేశారు. 1996లో ఇక్కడ నుండే తెలంగాణ సాగునీటి ప్రాజెక్టుల గురించి కేసీఆర్ మాట్లాడారని తెలిపారు. తెలంగాణ ఏర్పడగానే 46వేల చెరువులకు కేసీఆర్ జీవం పోశారని వెల్లడించారు. కేసీఆర్ కంటే

2లో..

ఏపీలో పరిశ్రమలకు పారదర్శక రాయితీలు

- జపాన్ రాయబారితో సీఎం చంద్రబాబు భేటీ



అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక పెట్టుబడులను పెద్దఎత్తున ఆకర్షించేందుకు పూర్తి పారదర్శకమైన రాయితీల విధానాన్ని అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పరిశ్రమలకు అందించే ప్రభుత్వ రాయితీల చెల్లింపుల కోసం ప్రత్యేకంగా 'ఎస్క్రో అకౌంట్' విధానాన్ని తీసుకొచ్చామని, రాష్ట్రంలో 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ఆయన తెలిపారు. విశాఖపట్నంలో పర్యటించిన జపాన్ రాయబారి కెయిచీ ఓనో నేతృత్వంలోని బృందంతో ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమావేశం

2లో..

తెలంగాణలో విద్యా విప్లవానికి శ్రీకారం

తరగతులను మూడు విభాగాలుగా వర్గీకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. నర్సరీ నుంచి 4వ తరగతి వరకు ప్రాథమిక విద్యగా, 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు సెకండరీ విద్యగా, 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ (+2) వరకు ఉన్నత విద్యగా పరిగణించాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ స్థాయిలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనతో పాటు నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేయాలని నిర్ణయించారు. భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

ప్రభుత్వ బడులకు ఆధునిక హంగులు

ప్రైవేటు విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ద్వారా పేద విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందించాలని అధికారులకు సూచించారు. ఈ పాఠశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని ఆదేశించారు. మరోవైపు పాలిటెక్నిక్ కోర్సుల ఆధునికీకరణకు అవసరమైన నిధుల మంజూరు ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. సంక్షేమ హాస్టళ్లను ఇకపై అద్దె భవనాల్లో నిర్వహించకూడదని, వాటికి సొంత భవనాలు నిర్మించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

పేద పిల్లల కలలకు చిరునామాగా యంగ్ ఇండియా స్కూల్స్

పేద విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడమే లక్ష్యంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ప్రభుత్వం నిర్మిస్తోంది. భవనాలు నిర్మించడం సులభమేనని, కానీ పిల్లల కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వాలకు బలమైన సంకల్పం ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి గతంలో పేర్కొన్నారు. ఆ సంకల్పంతోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ పాఠశాలల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు.
కులం, మతం, ప్రాంతం అనే భేదాలకు అతీతంగా ప్రతి చిన్నారికీ ప్రపంచస్థాయి విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ పాఠశాలల్లో చదివే పేద పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, వైద్యులుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా యంగ్ ఇండియా స్కూల్స్ నిలవనున్నాయని అభిప్రాయపడ్డారు. పేద పిల్లల కలలకు చిరునామాగా, తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయని పేర్కొన్నారు.

సమీక్షలో ఉన్నతాధికారులు

ఈ ఉన్నతస్థాయి సమీక్షా సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రభుత్వ సలహాదారులు కే. కేశవరావు, సుదర్శన్ రెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ముద్రా, ఎరువుల సబ్సిడీలకు ఆమోదం

1. యుగే యుగీన్ భారత్ మ్యూజియానికి రూ. 3,230 కోట్లు

న్యూఢిల్లీలోని చారిత్రాత్మక నార్త్ , సౌత్ బ్లాక్ భవనాలను ఉపయోగిస్తూ అత్యంత ప్రతిష్టాత్మకంగా 'యుగే యుగీన్ భారత్ మ్యూజియం'ను అభివృద్ధి చేయడానికి కేబినెట్ రూ. 3,230 కోట్లు మంజూరు చేసింది. భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని, వేల సంవత్సరాల చరిత్రను ఒకే ప్రాంగణంలో ప్రపంచానికి చాటిచెప్పడమే ఈ మ్యూజియం ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం.

2. నోయిడా మెట్రో కారిడార్ విస్తరణ

ఢిల్లీ ఎన్‌సీఆర్ ప్రాంతంలో రవాణా అనుసంధానాన్ని పెంచేందుకు రూ. 2,390 కోట్ల అంచనా వ్యయంతో మెట్రో రైలు విస్తరణకు కేబినెట్ పచ్చజెండా ఊపింది. ఈ నూతన కారిడార్ నోయిడాలోని సెక్టార్ 51 నుండి గ్రేటర్ నోయిడాలోని సెక్టార్ 4 వరకు సుమారు 8.5 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంటుంది.

3. రైతులకు రూ. 62,370 కోట్ల ఎరువుల సబ్సిడీ

రాబోయే రబీ సీజన్‌లో రైతులకు సకాలంలో, రాయితీ ధరలకే ఎరువులు అందుబాటులో ఉంచేందుకు కేబినెట్ రూ. 62,370 కోట్లను ఆమోదించిందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. ఈ నిర్ణయం ద్వారా దేశంలోని కోట్లాది మంది రైతులకు ఆర్థికంగా పెద్ద ఊరట లభించనుంది.

4. ముద్రా యోజనకు రూ. 5,000 కోట్ల బూస్ట్

చిన్న వ్యాపారాలను బలోపేతం చేసేందుకు 'ప్రధాన మంత్రి ముద్రా యోజన' కింద సూక్ష్మ యూనిట్ల కోసం ఉద్దేశించిన క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌ను మరో ఐదేళ్లపాటు కొనసాగించేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సూక్ష్మ సంస్థలకు రుణ మద్దతు సులభతరం చేసేందుకు ఈ ఫండ్‌కు రూ. 5,000 కోట్లు కేటాయించారు.

5. స్టాండ్-అప్ ఇండియాకు రూ. 4,111 కోట్లు

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, మహిళా పారిశ్రామికవేత్తలు కొత్త వ్యాపారాలు ప్రారంభించేందుకు మద్దతుగా నిలిచే 'స్టాండ్–అప్ ఇండియా' పథకం క్రెడిట్ గ్యారెంటీ ఫండ్‌ను కూడా మరో ఐదేళ్లపాటు పొడిగించారు. ఈ కేటాయింపు కోసం ప్రభుత్వం రూ. 4,111 కోట్లను ఆమోదించింది.

విదేశీ శక్తులకు వేదికగా కాంగ్రెస్ సదస్సు

ఏర్పడ్డారని అందులో రాహుల్ గాంధీ కూడా భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. గతంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీతో ఈ కూటమికి చెందిన నాయకులు దిగిన ఫొటోలను పరిశీలిస్తే వారి సంబంధాలు స్పష్టమవుతాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వ్యాఖ్యానించారు.

రెజీమ్ చేంజ్' పేరుతో కుట్రపూరిత కార్యకలాపాలు

'ప్రోగ్రెసివ్ ఇంటర్నేషనల్' సంస్థ ప్రతినిధుల బృందంతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే న్యూఢిల్లీలో సమావేశమయ్యారని, 10 జనపథ్‌లో సోనియా గాంధీ సైతం వారితో ప్రత్యేకంగా భేటీ అయ్యారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు పేర్కొన్నారు. ఈ సంస్థ వెనుక జార్జ్ సోరోస్ వంటి భారత వ్యతిరేక శక్తులు ఉన్నాయని ఆరోపించారు. ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోసేందుకు 'రెజీమ్ చేంజ్' పేరుతో కుట్రపూరిత కార్యకలాపాలు సాగిస్తున్నాయని విమర్శించారు.

స్పెయిన్, ఫ్రాన్స్, అల్బేనియా, నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో ఈ కూటమి తీవ్ర అలజడులకు కారణమైందని ఆరోపించారు. ఇప్పుడు అదే శక్తులను భారత్‌లోకి తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు.ఇలాంటి విదేశీ శక్తుల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'భారత్ సమ్మిట్' నిర్వహించడం వెనుక అసలు ఉద్దేశం రాజకీయంగా విఫలమైన రాహుల్ గాంధీని మళ్లీ ప్రజల ముందుకు తీసుకురావడమేనని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు.

భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న శక్తులతో కలిసి సదస్సులు

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తే తమకు అభ్యంతరం లేదని, అయితే భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న శక్తులతో కలిసి సదస్సులు నిర్వహించడం సరికాదని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు అన్నారు. ప్రోగ్రెసివ్ అలయెన్స్‌లోని దేశాల్లో 42 దేశాలు ఇస్లామిక్ దేశాలని, మిగిలినవాటిలో ఎక్కువ దేశాలు వామపక్ష భావజాలం కలిగినవని రాంచందర్ రావు పేర్కొన్నారు.
భారతదేశంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించి, అశాంతి సృష్టించేందుకు విదేశీ శక్తులు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చుకునే ప్రయత్నం చేస్తున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ఆరోపించారు.

హైదరాబాద్ సదస్సును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం

భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ విజన్‌ను వినాలని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారని, ఇప్పటికే దేశ ప్రజల మద్దతు కోల్పోయిన రాహుల్ గాంధీని 100 దేశాల నుంచి వచ్చిన ప్రతినిధుల సమక్షంలో ప్రధానమంత్రి అభ్యర్థిగా ప్రాజెక్ట్ చేయాలని చూస్తున్నారని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు విమర్శించారు. విదేశీ ప్రతినిధులను అడ్డుపెట్టుకుని రాహుల్ గాంధీని రాజకీయంగా తిరిగి లాంచ్ చేయాలనుకోవడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. భారతదేశానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న శక్తులు, ప్రోగ్రెసివ్ అలయెన్స్ అండతో హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ఈ సదస్సును బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పష్టం చేశారు.

ప్రపంచ రాజకీయాలకు వేదికగా హైదరాబాద్

అంతర్జాతీయ స్థాయిలో స్పందన, గుర్తింపు వచ్చిందని తెలిపారు. పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు సన్నద్ధ సమావేశం బుధవారం ఉదయం నిర్వహించారు.

70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులు హాజరు

ఈనెల 12 నుంచి 14 వరకు నిర్వహిస్తున్న ఈ ప్రతిష్టాత్మక భారత్ సమ్మిట్‌లో సుమారు 70 దేశాల నుంచి 1000 మంది ప్రతినిధులు పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారని భట్టి విక్రమార్క తెలిపారు. ఆర్థిక రంగానికి స్విట్జర్లాండ్‌లోని దావోస్ నగరం ఎలాగో.. ప్రపంచ రాజకీయ, సామాజిక, ఆర్థిక చర్చలకు హైదరాబాద్ మరో కేంద్రంగా ఎదగాలని, అందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, శ్యామ్ పిట్రోడా సహా పలువురు ప్రముఖులు ఈ సమ్మిట్‌లో పాల్గొననున్నారని తెలిపారు. ప్రజాస్వామ్య, ఉదారవాద, ప్రగతిశీల శక్తులను ఒకే వేదికపైకి తీసుకురావడమే లక్ష్యంగా భారత్ సమ్మిట్ లక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

36 సాగునీటి ప్రాజెక్టులను రెండున్నరేళ్లలో పూర్తి చేయాలి

చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకోసం కార్పొరేషన్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైతే ప్రతి జిల్లాకు ఒక చీఫ్ ఇంజినీర్ లేదంటే సూపరింటెండింగ్ ఇంజినీర్‌ను నియమించి పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. మరమ్మతుల కోసం అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలన పూర్తి చేసిన వెంటనే టెండర్లు పిలవాలని, ఆలస్యం చేయకుండా పనులు ప్రారంభించాలని సీఎం సూచించారు. వచ్చే జూన్ నాటికి అన్ని ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణ పనులు పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు.

ఇరిగేషన్ భూముల్లో 903.1 మెగావాట్ల సౌర విద్యుత్

జలవనరుల శాఖ పరిధిలో అందుబాటులో ఉన్న 5,565 ఎకరాల భూమిలో సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు 4,061 ఎకరాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వీటి ద్వారా 877.3 మెగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని వివరించారు. ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పరిధిలో 84 ప్రాంతాలను గుర్తించగా, వాటిలో 110 ఎకరాలను సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. దీని ద్వారా 25.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని తెలిపారు. మొత్తంగా 4,171 ఎకరాల భూమిని సౌర విద్యుత్ ప్లాంట్లకు వినియోగించడం ద్వారా 903.1 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయవచ్చని అధికారులు వివరించారు. కేవలం భూములకే పరిమితం కాకుండా కాలువలపై కూడా సౌర విద్యుత్, జలవిద్యుత్ ఉత్పత్తి అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు. సాగు సీజన్‌లో ఎత్తిపోతల పథకాలకు నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా ప్రణాళిక రూపొందించడంతో పాటు మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు సరఫరా చేయడం ద్వారా ఆదాయం పొందే విధానాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. రవాణా, విద్యుత్ ఉత్పత్తి, సౌర విద్యుత్, వ్యవసాయ రంగాలను అనుసంధానం చేయడం ద్వారా సంపద సృష్టికి అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటుపై అధ్యయనం

ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ తరహాలోనే జలవనరుల రంగంలోనూ వాటర్ రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. పోర్టులు, విద్యుత్ రంగాల్లో ఉన్న విధంగానే సాగునీటి రంగంలోనూ నియంత్రణ వ్యవస్థను తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. గంగా–కావేరి అనుసంధానం వంటి భారీ ప్రాజెక్టుల ద్వారా రవాణా, విద్యుత్, పరిశ్రమలు, వ్యవసాయ రంగాలకు నీటి వనరులను అందుబాటులోకి తీసుకురావచ్చని, ఆయా రంగాలకు నీటి వినియోగంపై రెగ్యులేటరీ కమిషన్ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

నిధులకు కొరత రానివ్వను.. ప్రాజెక్టులు పూర్తవ్వాలి

ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిష్టాత్మంగా తీసుకున్న 36 సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులను వెంటనే విడుదల చేసేందుకు సిద్ధంగా ఉన్నామని సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. నిర్దేశించుకున్న గడువులోగా పనులన్నీ పూర్తి చేయాలని ఆదేశించారు.వచ్చే రెండున్నరేళ్లలో ప్రభుత్వం నిర్దేశించుకున్న 36 సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు.

విజయసాయిరెడ్డి సారథ్యంలో

'పరివర్తన రాజనీతి పార్టీ' ఆవిర్భావం

వైసీపీ కోసం ఎంతో చేశా.. చివరికి అవమానాలు మిగిలాయి

'గతంలో వైఎస్సార్‌సీపీ నిర్మాణంలో ఇటుక ఇటుక పేర్చి కష్టపడిన నాకు చివరకు అవమానమే దక్కింది. నాయకత్వాన్ని గౌరవించడం విధేయత అనిపించుకుంటుంది. కానీ, అది బానిసత్వం కాకూడదు. 2019లో 151 స్థానాలు ఇచ్చిన రాష్ట్ర ప్రజలు, 2024 అసెంబ్లీ వైఎస్సార్‌సీపీని 11 సీట్లకే ఎందుకు పరిమితం చేశారో మాజీ సీఎం వైఎస్ జగన్ ఆత్మపరిశీలన చేసుకోవాలి. ప్రజలు తిరస్కరించింది సంక్షేమాన్ని కాదు, కేవలం నాయకుడి అహంకారాన్ని కార్యకర్తలను దూరం చేసుకున్న రాజకీయ సంస్కృతిని' అన్నారు.

వైసీపీ, టీడీపీ తీరుపై నిలదీత.. రాష్ట్ర అప్పులపై ఆందోళన

మరోవైపు, గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను చంద్రబాబు నాయుడు ప్రభుత్వం విస్మరించినందుకు ప్రజలు నిలదీస్తున్నారని విజయసాయిరెడ్డి అన్నారు. వారు పోస్టర్లలో చూపించే అభివృద్ధి రియల్ టైంలో కనిపించడం లేదన్నారు. రాష్ట్ర అప్పులు పుష్కర కాలంలో లక్ష కోట్ల నుంచి దాదాపు 10 లక్షల కోట్లకు చేరాయే తప్ప సంపద సృష్టి జరగలేదు అన్నారు. ఉద్యోగాలు లేక యువత, గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతున్నారు.

రౌడీయిజం, రెడ్ బుక్ రాజ్యాంగం, రాజకీయం పేరిట కక్షసాధింపు చర్యలు చేపడితే టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పతనం తప్పదన్నారు. తిరుమల లడ్డూ వివాదం వంటి సున్నితమైన అంశాలను రాజకీయం చేస్తూ హిందువుల మనోభావాలతో ఆడుకోవడం అత్యంత శోచనీయం అన్నారు. మన పరివర్తన రాజనీతి పార్టీ ఏ ఒక్కరికీ బీ టీమ్ కాదని, 5 కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవానికి మాత్రమే జవాబుదారీగా నిలుస్తుందన్నారు.

66 శాతం సీట్లు యువతకే..

'2029 ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసి విజయం సాధించడమే మా లక్ష్యం. సామాజిక న్యాయంలో భాగంగా బిసి, ఎస్సి, ఎస్టి, మైనారిటీ వర్గాలకు జెండాలు మోసేందుకే కాకుండా రాష్ట్ర ప్రభుత్వాన్ని నడిపే స్థాయిలో ప్రాతినిధ్యం కల్పిస్తాం. రాబోయే ఎన్నికల్లో 66 శాతం ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లను జెన్–జీ, యువతకే కేటాయిస్తామని మాటిస్తున్నాను. మన పార్టీ మేనిఫెస్టో కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, ప్రతి 3 నెలలకోసారి ప్రభుత్వ ఆదాయ వ్యయాలపై శ్వేతపత్రం విడుదల చేసే పారదర్శక పాలన అందిస్తాం. తమిళనాడు తరహాలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా మూడో ప్రత్యామ్నాయం సాధ్యమని నిరూపిస్తాం. అవినీతి రహిత, ప్రక్షాళన రాజకీయాలకు ఈ వేదిక ద్వారా నాంది పలుకుతున్నామని' విజయసాయిరెడ్డి తన ప్రసంగంలో స్పష్టం చేశారు.

నా గడ్డంపైనే వాళ్లకు ఫికర్

ఎక్కువ ఇస్తామని కాంగ్రెస్ వాళ్లు ప్రచారం చేశారని, అడ్డగోలుగా బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని ఆయన మండిపడ్డారు. “ఆంధ్రాకు నీళ్లు.. తెలంగాణకు ఎక్కిళ్లు ఎందుకు” అని కేటీఆర్ ప్రశ్నించారు. అరచేతిలో వైకుంఠం చూపించిన కాంగ్రెస్ నాయకులు బోగస్ మాటలతో ఓట్లు వేయించుకున్నారని ఆరోపించారు. ఏపీలో చంద్రబాబు నాయుడు 700 కిలోమీటర్లు నీళ్లు పారించారని, తెలంగాణలో మాత్రం చెరువులు ఎండిపోతున్నాయని మండిపడ్డారు.

గోదావరి పారే ఈ ప్రాంతంలో కరువు ప్రకటన పరిస్థితి ఎందుకు వచ్చిందని నిలదీశారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని, కాంగ్రెస్ తెచ్చిన కరువని మరోసారి దుయ్యబట్టారు. ప్రజల దృష్టి మరల్చేందుకే కరువు పేరుతో కాంగ్రెస్ నేతలు ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ నాయకులకు రాష్ట్ర సమస్యలు పట్టడంలేదు, కానీ తన గడ్డంపై ఫికర్ ఉందని కేటీఆర్ ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన గడ్డం గురించి ఇటీవల చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ ఉంటే నీళ్ల జాతర ఉండేదని, రైతు కష్టం తెలిసిన నాయకుడని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక నీటి పన్ను కూడా రద్దు చేసి, 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందించారని అన్నారు. కాళేశ్వరం, పాలమూరు, సీతారామ వంటి ప్రాజెక్ట్‌లను పూర్తిచేశారన్నారు. కాంగ్రెస్ వచ్చిన తరవాత సంక్షేమ పథకాలను అటకెక్కించారని విమర్శించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి పథకాలను నిలిపివేశారని, మూడుసార్లు రైతు బంధు కూడా ఎగ్గొట్టారని ఆరోపించారు. కేసీఆర్ త్వరలోనే వస్తారని, అన్ని ప్రశ్నలకు ఆయన సమాధానం ఇస్తారని చెప్పారు. నిర్మల్‌లో నేతలు పార్టీ మారినా కార్యకర్తలు మాత్రం బీఆర్ఎస్‌ను వీడలేదని అన్నారు.

కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి

బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించాం

గ్రాడ్యుయేట్లంతా ఓటర్లుగా నమోదు చేసుకొని తప్పనిసరిగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. తమ పార్టీ అభ్యర్థులు ఉన్నత విద్యావంతులని, ఒకరు ఉస్మానియా యూనివర్సిటీ గ్రాడ్యుయేట్ కాగా మరొకరు కాకతీయ యూనివర్సిటీకి చెందిన ఉద్యమకారుడని కవిత వివరించారు. వారికి రాజకీయంగా, ఆర్థికంగా పెద్దగా అండదండలు లేకపోయినా ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పం ఉందన్నారు. సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ ఇద్దరు బీసీ అభ్యర్థులకు అవకాశం కల్పించామని తెలిపారు. ఆకాశ్ కొల్లూరి కుమ్మరి సామాజిక వర్గానికి చెందినవారని, ఆ వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించాలనే ఉద్దేశంతో ఆయనను బరిలోకి దించామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చెప్పారు.

మండలిలో ప్రతిపక్ష పాత్ర బలహీనంగా ఉంది

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లు డబ్బులు తీసుకొని ఓట్లు వేస్తారన్న అపవాదును తొలగించుకోవాల్సిన అవసరం ఉందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ముఖ్యమంత్రి రూ.200 కోట్లు ఖర్చు పెట్టయినా తమ అభ్యర్థులను గెలిపించుకుంటామని చెబుతున్నారని విమర్శించారు. విద్యావంతులు కూడా డబ్బులు తీసుకొని ఓటు వేస్తే వ్యవస్థలో అవినీతి మరింత పెరుగుతుందని అన్నారు. రాష్ట్రంలో సుమారు 80 లక్షల మంది డిగ్రీ విద్యార్హత కలిగిన వారు ఉన్నారని, వారంతా ఆలోచించి ఓటు వేయాలని సూచించారు. శాసనమండలిలో మొత్తం 40 మంది సభ్యులు ఉండగా, గ్రాడ్యుయేట్ల ద్వారా ఎన్నికయ్యే వారు ముగ్గురేనని కవిత గుర్తుచేశారు. ప్రజల తరఫున గొంతెత్తే ప్రతినిధులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం మండలిలో ప్రతిపక్ష పాత్ర బలహీనంగా ఉందని, తమ అభ్యర్థులను గెలిపిస్తే గ్రాడ్యుయేట్ల సమస్యలపై పోరాటం చేస్తామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చెప్పారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, నదీ జలాల కోసం పోరాటం

రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాల పరిధిలో సుమారు 75 నియోజకవర్గాల్లో ఎన్నికల వాతావరణం నెలకొందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత తెలిపారు. తమ అభ్యర్థుల గెలుపు కోసం పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేస్తాయని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల, నదీ జలాల సాధన, ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు కోసం తమ పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీల మద్దతు కోరుతామని తెలిపారు. మహిళలకు రిజర్వేషన్లు ఉన్నా లేకపోయినా తమ పార్టీ తరఫున 33 నుంచి 50 శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించారు. హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానానికి మహిళా అభ్యర్థిని పోటీకి దించాలని భావించినప్పటికీ సామాజిక న్యాయానికి ప్రాధాన్యతనిస్తూ బీసీ అభ్యర్థికి అవకాశం కల్పించామని వివరించారు. పార్టీ గుర్తింపు ప్రక్రియ ఎన్నికల సంఘం వద్ద కొనసాగుతోందని, సానుకూల నిర్ణయం వస్తుందన్న నమ్మకం ఉందని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ సమావేశంలో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌ఛార్జీలు డాక్టర్ రఘు, సయ్యద్ ఇస్మాయిల్, జిల్లా ఎన్నికల కోఆర్డినేటర్లు గొంగళ్ల రంజిత్, అర్చనా సేనాపతి, వాసిలి చంద్రశేఖర్, రామ్ కళ్యాణ్ చల్లా, మతిన్, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో పరిశ్రమలకు పారదర్శక రాయితీలు

నిర్వహించారు. ఈ భేటీలో పారిశ్రామిక పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, కీలక ఖనిజాల సరఫరా, ఉక్కు పరిశ్రమ, గ్రీన్ ఎనర్జీ వంటి పలు కీలక రంగాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో అపారమైన యువశక్తి అందుబాటులో ఉందని, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారికి నైపుణ్య శిక్షణ అందిస్తే అత్యుత్తమ మానవ వనరులుగా మారతారని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, ఈ ప్రక్రియలో జపాన్ సంస్థలు భాగస్వామ్యం కావాలని కోరారు. ఇందుకు జపాన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందిస్తూ, ప్రస్తుతం రాష్ట్రంలోని పరిశ్రమల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు. కీలక ఖనిజాలైన 'రేర్ ఎర్త్ మినరల్స్'ను జపాన్‌కు నిరంతరాయంగా సరఫరా చేసే అంశంపైనా ఈ సమావేశంలో ప్రధానంగా చర్చ జరిగింది. ఈ సహకారం భారత్–జపాన్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని జపాన్ రాయబార బృందం అభిప్రాయపడింది. అలాగే ఆర్సెలార్ మిట్టల్–నిప్పన్ స్టీల్ ఇండియా ఉక్కు ప్లాంట్‌కు సంబంధించి, తుది దశ ప్రాసెసింగ్ కోసం అవసరమైన సెమీ ఫినిష్డ్ ఉత్పత్తులను జపాన్‌లోని మాతృసంస్థ నుంచి దిగుమతి చేసుకునే ప్రక్రియకు ప్రభుత్వం తగిన తోడ్పాటు అందించాలని కోరారు. మరోవైపు విద్యుత్ పంపిణీలో అధిక సామర్థ్యం కలిగిన ట్రాన్స్‌ఫార్మర్ల తయారీకి ఉపయోగించే 'అమార్ఫస్ మెటల్'ను దేశంలోనే తొలిసారిగా ఉత్పత్తి చేయాలని ప్రొటీరియల్ ఇండియా నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పారిశ్రామిక ప్రోత్సాహకాల సహకారంతో 2026 డిసెంబరు నాటికి శ్రీసిటీలో ఈ యూనిట్ ఉత్పత్తి ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రతినిధులు వివరించారు.భారతీయ నిపుణుల ప్రతిభను అంతర్జాతీయ అవసరాలకు వినియోగించుకునే దిశగా విశాఖపట్నంలో భారత్–జపాన్ సహకారంతో కొత్తగా 'గ్లోబల్ కేపబిలిటీ సెంటర్' (జీసీసీ) ఏర్పాటు చేసినట్లు జపాన్ ప్రతినిధులు తెలిపారు. దీనితో పాటు హరిత ఇంధన రంగంలో కీలక ముందడుగు పడింది. కాకినాడ నుంచి ఏటా సుమారు 70 వేల టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఐదేళ్ల పాటు కొనుగోలు చేసేందుకు జపాన్‌కు చెందిన ప్రముఖ విద్యుత్ దిగ్గజం 'జెరా', ఏపీకి చెందిన 'ఏఎం గ్రీన్' సంస్థతో ప్రాథమిక ఒప్పందం కుదుర్చుకుంది. ఈ పరిణామం రెండు దేశాల మధ్య పటిష్టమైన గ్రీన్ అమ్మోనియా సరఫరా వ్యవస్థ నిర్మాణానికి బలమైన పునాదిగా నిలుస్తుందని ఇరు వర్గాలు ధీమా వ్యక్తం చేశాయి.

హాస్టల్ విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేసిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది



ఆళ్లగడ్డ ఆళ్లగడ్డ పట్టణంలోని పలు హాస్టల్స్,గురుకుల పాఠశాల వి విద్యార్థినిలకు వైద్య అధికారి డాక్టర్ నరసింహ మరియు డాక్టర్ గీతిక రెడ్డి ఎం పి హెచ్ ఈ ఓ వి. దస్తగిరి రెడ్డి సబ్ యూనిట్ అధికారి శివచంద్ర రెడ్డి దోమతెరలు పంపిణీ చేశారు. దోమకాటు ద్వారా వ్యాప్తి చెందు వ్యాధులు కంట్రోల్ కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ పట్టణంలోని మహాత్మ జ్యోతి పూలే హాస్టల్. మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థినిలకు దోమ తెరలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలకు దోమతెలను ఎలా ఉపయోగించుకోవాలి వాటిని ఎలాగా బద్రపరుచుకోవాలి తదితర అంశాలపై అవగాహన కల్పిస్తూ , దోమకాట ద్వారా వ్యాప్తి చెందు మలేరియా, డెంగు, చికెనుగుణ్యా వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఎలా అని అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ సబ్ యూనిట్ అధికారి , వై శివ చంద్రారెడ్డి ప్రిన్సిపల్ సిహెచ్చే సంధ్యారాణి కృష్ణవేణి శ్రీలతహెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ గీతిక రెడ్డి, డాక్టర్ నరసింహ, సచివాలయం ఏఎన్ఎమ్స్, మగ ఆరోగ్య కార్యకర్తలు ఆశలు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

హైదరాబాద్‌ను సరికొత్తగా

తీర్చిదిద్దడమే లక్ష్యం

- తమ్మిడికుంట చెరువును ప్రారంభించిన సీఎం రేవంత్రెడ్డి

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన మూసీ నది ప్రక్షాళన ప్రాజెక్టుకు సంబంధించి అన్ని అనుమతులు లభించాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడించారు. త్వరలోనే పనులకు సంబంధించి టెండర్ల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. మొత్తం 55 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న మూసీ నదిలో తొలివిడతగా 21 కిలోమీటర్ల మేర పునరుజ్జీవన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. నగరంలోని హైటెక్ సిటీ ప్రాంతంలో ఆధునిక హంగులతో పునరుద్ధరించిన తమ్మిడికుంట చెరువును ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రకృతిని కాపాడటం, భవిష్యత్తు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.మూసీ ప్రక్షాళన నిర్ణయం వల్ల కొందరికి ఇబ్బందులు ఎదురైనా, తనకు ఎలాంటి స్వార్థం లేదని, ఎవరిపైనా వ్యక్తిగత కోపం లేదని సీఎం పేర్కొన్నారు. మంచి సంకల్పంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. చెరువులను ఆక్రమించిన వారి నుంచి విముక్తి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టంగా పనిచేస్తోందని చెప్పారు. అవసరమైతే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొని నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని స్పష్టం చేశారు.తమ్మిడికుంట చెరువును పునరుద్ధరించే క్రమంలో కొంత ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యాయని, ప్రభుత్వ నిర్ణయాల వల్ల కొందరి మనసులు నొచ్చుకుని ఉండవచ్చని అన్నారు. అయితే రాబోయే తరాలకు మేలు చేయాలన్నదే తమ ఉద్దేశమని వివరించారు. గతంలో 14 ఎకరాలుగా ఉన్న చెరువు విస్తీర్ణాన్ని 30 ఎకరాలకు పెంచి సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఇందుకోసం సినీనటుడు అక్కినేని నాగార్జున రెండు ఎకరాల స్థలాన్ని అందించి సహకరించారని ప్రశంసించారు. సినిమాల్లోనే కాకుండా నిజజీవితంలోనూ ఆయన హీరోగా నిలిచారని కొనియాడారు. అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములయ్యే వారిని గౌరవిస్తామని, అందులో భాగంగానే నాగార్జునను సత్కరించినట్లు వెల్లడించారు.ఒకప్పుడు హైదరాబాద్ నగరం 1,372 చెరువులతో కళకళలాడేదని, వివిధ కారణాలతో దాదాపు సగం చెరువులు కనుమరుగయ్యాయని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణలు, ప్రభుత్వాల నిర్లక్ష్యం, నగరానికి వలసలు పెరగడం ఇందుకు కారణమయ్యాయని చెప్పారు. తమ్మిడికుంటతో పాటు బతుకమ్మకుంట, బుమ్‌-రుక్కుద్దౌలా, సున్నం చెరువు, నల్లచెరువు, ఫాక్స్‌సాగర్, మియాపూర్ చెరువులతో పాటు సుమారు 20 చెరువులను పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు.వర్షాలు కురిసినప్పుడు నగర రహదారులు జలమయమై, గంటల తరబడి ట్రాఫిక్ సమస్యలు ఏర్పడటానికి చెరువుల ఆక్రమణలే ప్రధాన కారణమని పేర్కొన్నారు. నీరు ఉండాల్సిన ప్రాంతాలను ఆక్రమిస్తే చివరకు నివాస ప్రాంతాల్లోకి వరద నీరు చేరుతుందని, పేద కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని వివరించారు. 1908లో సంభవించిన భారీ వరదల్లో వేలాది మంది ప్రాణాలు కోల్పోయిన అనంతరం నిజాం ప్రభుత్వం ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య సూచనలతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలు చేపట్టిందని గుర్తుచేశారు. వందేళ్లు దాటినా ఆ జలాశయాలు నేటికీ హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీరుస్తున్నాయని తెలిపారు. ఒకప్పుడు మూసీ నది తీరంలో చారిత్రక కట్టడాలు, వ్యాపార కేంద్రాలు విలసిల్లాయని, ప్రభుత్వాల నిర్లక్ష్యంతో నది మురికికూపంగా మారిందని అన్నారు.మూసీ కాలుష్యం కారణంగా నల్లగొండ జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఫ్లోరైడ్ సమస్యకు తోడు నదీ కాలుష్యం వారి జీవితాలను దుర్భరం చేసిందని చెప్పారు. రైతులతో స్వయంగా మాట్లాడి వారి బాధలను తెలుసుకున్నానన్నారు. మూసీలో మానవ వ్యర్థాలు, పశువుల కళేబరాలు, ఇతర కాలుష్య పదార్థాలు పేరుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇది సుందరీకరణ కాదు.. ప్రక్షాళన

మూసీ ప్రక్షాళన అనేది కేవలం సుందరీకరణ కార్యక్రమం కాదని, ప్రజల జీవితాలతో ముడిపడిన కీలకమైన ప్రాజెక్టు అని సీఎం స్పష్టం చేశారు. ఎవరూ నష్టపోకుండా బాధితులను నూటికి నూరు శాతం ఆదుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని హామీ ఇచ్చారు. సబర్మతీ, గంగా, యమునా నదుల తరహాలో మూసీని అభివృద్ధి చేయాలని ఆకాంక్షించారు. దక్షిణ కొరియాలో నదీ తీర ప్రాంతాల అభివృద్ధి ద్వారా ఆర్థిక కార్యకలాపాలు విస్తరించిన విషయాన్ని ప్రస్తావించారు. తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణతో కాలుష్యం తగ్గడమే కాకుండా భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. చెరువు నిర్వహణ బాధ్యతను సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్‌తో పాటు ఇందిరా మహిళా శక్తి సభ్యులు చేపట్టాలని సూచించారు. మహిళా శక్తి దుకాణాల ద్వారా స్థానికంగా ఉపాధి, ఆర్థిక కార్యకలాపాలు పెంచి చెరువు ఆధారిత ఆర్థిక వ్యవస్థను అభివృద్ధి చేయాలన్నారు. ఈ ప్రాంతాన్ని పండుగలు, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా తీర్చిదిద్దాలని, జమ్మి చెట్టును నాటాలని సూచించారు. ఈ కార్యక్రమానికి శాసనసభ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ అరెకపూడి గాంధీ అధ్యక్షత వహించగా, సినీనటుడు అక్కినేని నాగార్జున, ఎంపీలు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలు గద్వాల విజయ, శాసనమండలి విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తమ్మిడికుంట చెరువుకు పూర్వ వైభవం..

12 ఎకరాల నుంచి 30.5 ఎకరాలకు విస్తరణ

- హైడ్రా ఆధ్వర్యంలో చెరువు పునరుద్ధరణ..

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం..

- కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ



శేరిలింగంపల్లి (ప్రశ్న న్యూస్) మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఖానామెట్‌లో ఉన్న తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ, అభివృద్ధి పనులు పూర్తికావడంతో బుధవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగార్జున, ప్రభుత్వ శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, అనిల్ యాదవ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, కుంభం అనిల్ కుమార్ రెడ్డి, నవీన్ యాదవ్, తోట లక్ష్మీకాంతరావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్, కలెక్టర్ నారాయణ రెడ్డి, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్, సీఎంసీ కమిషనర్ జి. సృజన తదితరులు పాల్గొన్నారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ ప్రజాప్రతినిధులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ తమ్మిడికుంట చెరువు ప్రారంభోత్సవానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు, స్వాగతం తెలియజేశారు. గతంలో ఆక్రమణలు, పూడిక, వ్యర్థాలతో కుంచించుకుపోయిన చెరువును తిరిగి పూర్వ వైభవానికి తీసుకురావడం సంతోషకరమన్నారు. చెరువు పరిధిలోని ఆక్రమణలను తొలగించి, నాలాలను పునరుద్ధరించి, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు సుందరీకరణ పనులు చేపట్టడం ద్వారా ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వచ్చిందన్నారు.గతంలో సుమారు 12 ఎకరాలకే పరిమితమైన తమ్మిడికుంట చెరువు విస్తీర్ణం ఆక్రమణల తొలగింపుతో 30.5 ఎకరాలకు చేరిందని, హైడ్రా ఆధ్వర్యంలో సుమారు 35 వేల లారీల వ్యర్థాలను తొలగించి, నీటి నిల్వ సామర్థ్యాన్ని 46 మిలియన్ లీటర్ల నుంచి 375 మిలియన్ లీటర్లకు పెంచినట్లు తెలిపారు. చెరువు చుట్టూ పచ్చదనం, ఉద్యానవనాలు, నడక మార్గాలు, విద్యుత్ దీపాలతో అభివృద్ధి చేయడం వల్ల స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వచ్చిందన్నారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చెరువుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని గాంధీ కోరారు. తన సొంత నిధులతో కొన్ని చెరువుల సుందరీకరణ పనులు చేపట్టడంతో పాటు గంగారం, పటేల్ చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు పనులు చేయించినట్లు వివరించారు. గంగారం, పటేల్ చెరువులతో పాటు నియోజకవర్గ పరిధిలోని 64 చెరువుల అభివృద్ధి, సుందరీకరణకు ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఆరోగ్యకరమైన జీవనశైలి, ప్రశాంతమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.చెరువులు, నాలాల ఆక్రమణల తొలగింపు సమయంలో హైడ్రాపై కొందరు వ్యతిరేకత వ్యక్తం చేసినప్పటికీ, ప్రస్తుతం పునరుద్ధరణ పనులు పూర్తయి చెరువులు కొత్త రూపు సంతరించుకోవడంతో ప్రజల నుంచి ప్రశంసలు వస్తున్నాయని గాంధీ పేర్కొన్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్, అధికారుల కృషిని ప్రత్యేకంగా అభినందించారు. చెరువుల పరిరక్షణ ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రజలందరూ చెరువుల సంరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఒకప్పుడు ఆక్రమణలు, చెత్తాచెదారం, పూడికతో కనుమరుగయ్యే పరిస్థితికి చేరిన తమ్మిడికుంట చెరువు నేడు పచ్చదనం, నీటి నిల్వ సామర్థ్యం, నడక మార్గాలు, విద్యుత్ దీపాలతో సరికొత్త రూపాన్ని సంతరించుకుంది. నగరంలో చెరువుల పునరుద్ధరణ, పర్యావరణ పరిరక్షణ దిశగా చేపట్టిన ఈ అభివృద్ధి పనులు స్థానిక ప్రజలకు అందుబాటులోకి రావడంతో పరిసర కాలనీల వాసుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, తాజా మాజీ కార్పొరేటర్లు, కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ఘనంగా

జాతీయ విద్యా దినోత్సవ వేడుకలు



చిట్వేలి పుల్లంపేట మండలం దలవాయిపల్లి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో జాతీయ విద్యా దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న పురస్కార గ్రహీత మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 11న జాతీయ విద్యా దినోత్సవాన్ని పాఠశాల ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు రమణ విద్యార్థులకు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవిత చరిత్రను వివరించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రతో పాటు దేశంలో విద్యావ్యవస్థ అభివృద్ధికి, విద్యా సంస్కరణలకు ఆయన అందించిన విశేష సేవలను వివరించారు. ప్రతి ఒక్కరికీ విద్య అందుబాటులో ఉండాలనే ఆశయంతో ఆయన చేసిన కృషిని విద్యార్థులకు తెలియజేశారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని, వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ పురోగతికి విద్యే ప్రధానమైన సాధనమని పేర్కొంటూ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం విద్యార్థుల్లో సృజనాత్మకతను, ఆలోచనా శక్తిని పెంపొందించే ఉద్దేశంతో వ్యాసరచన, ఉపన్యాసం, చిత్రలేఖనం, రంగులు నింపడం వంటి పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. విద్య యొక్క ప్రాముఖ్యత, సమాజ నిర్మాణంలో విద్యార్థుల పాత్రను తెలియజేసే అంశాలపై విద్యార్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్య అంటే కేవలం పుస్తకాల్లోని పాఠాలను నేర్చుకోవడం మాత్రమే కాదని, మంచి ఆలోచనా విధానం, నైతిక విలువలు, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతలను పెంపొందించుకోవడమని తెలిపారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే క్రమశిక్షణతో చదువుతూ, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించేందుకు కృషి చేయాలని సూచించారు. భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమాలు విద్యార్థుల్లో విద్య పట్ల ఆసక్తిని పెంపొందించడంతో పాటు మహనీయుల జీవితాలు, వారి సేవల పట్ల అవగాహన కల్పించాయని తెలిపారు. విద్యతోనే వికాసం.. విద్యతోనే సమాజ ప్రగతి అనే సందేశంతో వేడుకలు ముగిశాయి.

ప్రతి బిడ్డకు మానసిక ఆరోగ్యం

భద్రత, విద్య కెరీర్ మార్గదర్శకత్వం



చిట్వేలి చిట్వేలి మండల విద్యాశాఖ అధికారి ఖాజా మొహిద్దీన్ ఆదేశాల మేరకు, చిట్వేల్ పి.ఎం. శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న అంగన్వాడీ కార్యకర్తల పోషణ్ భీ, పఢాయి భీ శిక్షణ కార్యక్రమానికి జిల్లా కెరీర్ గైడెన్స్, మానసిక ఆరోగ్య కౌన్సిలర్ డక్కిలి సుబ్రమణ్యం హాజరై విద్యార్థుల సమగ్రాభివృద్ధిలో కౌన్సెలింగ్ ప్రాధాన్యతను వివరించారు. ప్రతి అంగన్వాడీ కార్యకర్త తమ గ్రామ పరిధిలోని తల్లిదండ్రులకు చిట్వేలి మండలంలోని పాఠశాలల్లో కౌన్సెలింగ్ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలియజేయాలని కౌన్సిలర్ కోరారు. పిల్లల చదువు, ప్రవర్తన, మానసిక ఆరోగ్యం, భావోద్వేగ సమస్యలు, వ్యక్తిగత భద్రత, భవిష్యత్ విద్యా ప్రణాళికలు, కెరీర్ ఎంపిక వంటి అంశాల్లో తల్లిదండ్రులు అవసరమైనప్పుడు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా లేదా మండల విద్యాశాఖ అధికారి ద్వారా కౌన్సిలర్‌ను సంప్రదించేలా అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఆడపిల్లలకు చదువు, సమాన అవకాశాలు, వ్యక్తిగత భద్రత, ఆత్మవిశ్వాసం కల్పించడం ఎంత ముఖ్యమో, అబ్బాయిలకు కూడా చిన్ననాటి నుంచే సభ్యత, సంస్కారం, స్త్రీల పట్ల గౌరవం, సమానత్వ భావన, బాధ్యత, మానవతా విలువలు నేర్పడం అంతే ముఖ్యమని అన్నారు. ఈ దిశగా తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో లింగ వివక్షకు తావులేకుండా, అబ్బాయిలు, అమ్మాయిలు పరస్పరం గౌరవించుకునే ఆరోగ్యకరమైన కుటుంబ వాతావరణాన్ని నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని అంగన్వాడీ కార్యకర్తలను కోరారు. నేటి ఆధునిక కాలంలో పిల్లల మానసిక ఆరోగ్యంపై మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ గేమ్స్, అధిక స్క్రీన్ వినియోగం, సామాజిక మాధ్యమాలు, అనారోగ్యకరమైన స్నేహాలు, ఆన్‌లైన్ ప్రమాదాలు చూపుతున్న ప్రభావాలను తల్లిదండ్రులు గుర్తించాలని వివరించారు. పిల్లల్లో ఒత్తిడి, భయం, ఆందోళన, ఒంటరితనం, కోపం, చదువుపై ఆసక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు వంటి సంకేతాలను నిర్లక్ష్యం చేయకుండా, వారితో స్నేహపూర్వకంగా మాట్లాడి అవసరమైనప్పుడు కౌన్సిలర్ సహాయం పొందాలని సూచించారు. విద్యార్థుల అభిరుచులు, ఆసక్తులు, సామర్థ్యాలను గుర్తించి తగిన విద్యా అవకాశాలు, కోర్సులు, ఉన్నత విద్య, ఉద్యోగ రంగాలపై అవగాహన కల్పించడమే కెరీర్ గైడెన్స్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. పిల్లలపై తల్లిదండ్రుల ఆశయాలను బలవంతంగా రుద్దకుండా, వారి సామర్థ్యాలకు అనుగుణంగా లక్ష్యాలను నిర్దేశించుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. బాలల సమగ్రాభివృద్ధి అనేది కేవలం పాఠశాల బాధ్యత మాత్రమే కాదు. అంగన్వాడీ కార్యకర్తలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, కౌన్సిలర్ సమన్వయంతోనే పిల్లలకు ఆరోగ్యకరమైన బాల్యం, భద్రమైన వర్తమానం, ఉన్నతమైన భవిష్యత్తు అందించగలమని కౌన్సిలర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చిట్వేలి ఐసిడిఎస్ సిడిపిఓ వసుంధర, సూపర్‌వైజర్లు విజయకుమారి, సురేఖారాణి, చిట్వేలి మండల అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలు



చాగలమర్రి భారత దేశ మొదటి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నవంబర్ 11 న జాతీయ విద్యా దినోత్సవంగా భారత స్వతంత్ర్య సమర ముఖ్య నాయకులలో ఒకరైన మౌలానా అబుల్ కలాం ఆజాద్ జన్మ దినాన్ని పురస్కరించుకుని చాగలమర్రి లోని అజీం బ్రిలియంట్ ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ ఎం ఎస్ అన్సర్ బాషా పూల మాలతో ఆయన చిత్ర పటానికి నివాళు లు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ భారత ప్రభుత్వ తొలి విద్యా శాఖా మంత్రి, దేశంలో తొలి ఐఐటీ ని స్థాపించి దేశ యువతకు బంగారు బాట వేసిన విద్యావేత్తగా కొనియాడారు. సార్వత్రిక ప్రాథమిక విద్యను ప్రోత్సహించడానికి పాఠశాల మరియు కళాశాలల నిర్మాణ జాతీయ కార్యక్రమాల రూపకల్పన మరియు పాఠశాలలోకి పిల్లలను మరియు యువకుల నమోదును వ్యాప్తి చేయడంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ సూత్రధారి అని తెలిపారు. భారత దేశ తొలి విద్యా శాఖా మంత్రిగా గ్రామీణ పేదలు మరియు బాలికలకు విద్యను అందించడంపై ఆయన వైవిధ్యభరితమైన పెద్ద పీట వేశారు. ఒక్క క్షణం కూడా మరిచిపోకూడదు, కనీసం ప్రాథమిక విద్యను పొందడం ప్రతి వ్యక్తి యొక్క జన్మ హక్కు, అది లేకుండా అతను పౌరుడిగా తన విధులను పూర్తిగా నిర్వహించలేడు అని 1948 జనవరి 16 వ తేదీన అఖిల భారత విద్యా సదస్సులో ఆయన ప్రసంగించారు. భారత ప్రభుత్వం, ఆయన మరణానంతరం మౌలానా అబుల్ కలాం ఆజాద్ గారికి 1992 లో భారత రత్న ఇచ్చి గౌరవించిందని పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు

దుబ్బాకను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి



రాయపోల్:నవంబర్ 11 రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని దుబ్బాక నియోజకవర్గాన్ని వెంటనే కరువు ప్రాంతంగా ప్రకటించాలని, నిధుల కొరతతో ఆగిపోయిన అభివృద్ధి పనులు పున ప్రారంభించాలని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఉన్నందుకే నిధులు ఇవ్వడంలో వివక్ష చూపుతున్నారంటే, రైతుల కోసం తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని సవాల్ విసిరారు. నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సాగునీటి సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా రాయపోల్ అనాజీపూర్ గ్రామంలో ధాన్యం కొనుగోలు ప్రారంభంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాగునీటి కాల్వల పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. వివిధ కారణాలతో మధ్యలోనే నిలిచిపోయిన అభివృద్ధి పనులను తిరిగి ప్రారంభించి, అవసరమైన నిధులు కేటాయించి పూర్తిచేయాలని కోరారు. సాగునీటి వసతి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని, పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితో వ్యవహరించడం వల్ల నష్టపోయేది రైతులేనని అన్నారు. బీఆర్ఎస్ పార్టీపై ఉన్న రాజకీయ కోపాన్ని రైతులపై చూపించడం సరికాదని, పార్టీలకు అతీతంగా రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని హితవు పలికారు. రైతులకు సాగునీరు అందించడం, పంటలను కాపాడటం ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. అలాగే సిద్దిపేట జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. దుబ్బాక నియోజకవర్గ రైతులకు న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నిర్మల, మండల సర్పంచుల పోరం అధ్యక్షులు రేకుల నర్సింహారెడ్డి,మాజీ జెడ్పిటిసి యాదగిరి, మంతూర్ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్, మాసంపల్లి రాజు, ఉప సర్పంచ్ లు సంతోష్ కుమార్, హనుమంతు రాజు, మండల పార్టీ ఉపాధ్యక్షులు కొత్తపల్లి సత్యం, వెంకట్ గౌడ్, బాగిరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు రాజిరెడ్డి, ఇప్ప 63దయాకర్, గల్వ దయాకర్ రెడ్డి, మండల నాయకులు మల్లారెడ్డి, శ్రీధర్, భార్గవ్, బుజ్జి, రాజారాం మధు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక

కారేపల్లి : కారేపల్లి మండల పరిధిలోని చీమలపాడు విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో బుధవారం తిమ్మారావుపేట సబ్ డివిజన్, వైరా డివిజన్, ఖమ్మం సర్కిల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె.మాధవరావు (చైర్మన్ అండ్ మెంబర్ టెక్నికల్), ఎస్.సత్యనారాయణ (ఫైనాన్స్ సభ్యుడు), ఎం.రామారావు (ఇండిపెండెంట్ సభ్యుడు), విద్యుత్ శాఖ జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను సభ్యులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, విద్యుత్ బిల్లుల్లో తలెత్తుతున్న సమస్యలు, మీటర్ల పనితీరు, కొత్త విద్యుత్ సర్వీసు కనెక్షన్లు, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, ఇతర విద్యుత్ సేవలకు సంబంధించిన సమస్యలపై వినతులు సమర్పించారు. వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సభ్యులు అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి పథకం కొంతమంది అర్హులైన వినియోగదారులకు వర్తించకపోవడంపై చర్చించారు. వారికి కూడా పథకం వర్తింపజేసేలా కృషి చేస్తామని సభ్యులు హామీ ఇచ్చారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించాలని సూచించారు. విద్యుత్ శాఖకు సంబంధించిన ఏవైనా సమస్యలు ఉన్నప్పుడు వినియోగదారులు తమ ఫిర్యాదులను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ జిల్లా, మండల స్థాయి అధికారులు, సిబ్బంది, వివిధ గ్రామాల విద్యుత్ వినియోగదారులు పాల్గొన్నారు.

నిష్పక్షపాత ఎన్నికలే లక్ష్యం

- అధికారులు బాధ్యతగా విధులు

నిర్వహించాలి:



కలెక్టర్ గ్రామ పంచాయతీ ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా ఆదేశించారు.బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో రిటర్నింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఇతర ఎన్నికల అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల విధులపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.జిల్లాలోని 408 గ్రామ పంచాయతీలను 175 సమూహాలుగా విభజించి, 175 మంది తొలి దశ రిటర్నింగ్ అధికారులను నియమించినట్లు తెలిపారు. మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, ఎన్నికల గుర్తుల కేటాయింపు తదితర అంశాలపై అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల సంఘం నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ ఎన్నికల నిర్వహణను విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆజాద్‌కు ఘన నివాళి



- కలెక్టరేట్‌లో జయంతి వేడుకలు

నంద్యాల, భారత తొలి విద్యాశాఖ మంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను బుధవారం నంద్యాల కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆదేశాల మేరకు డీఆర్వో రామునాయక్ ఆధ్వర్యంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ పాత్ర, విద్యారంగ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు

రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులు కల్పించడమే రీసర్వే లక్ష్యం

జిల్లా కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) భూభారతి రీ సర్వే ప్రక్రియపై రైతులకు, గ్రామస్తులకు పూర్తి అవగాహన కల్పించేందుకు , కీసర మండలశీ బోగారం మండలంలో అవగాహన సదస్సు ను నిర్వహించారు. భూ రికార్డులను ఆధునీకరించడం, సరిహద్దు వివాదాలను శాశ్వతంగా పరిష్కరించడం రైతులకు తమ భూములపై స్పష్టమైన హక్కులను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం భూ భారతి రీ-సర్వే కార్యక్రమాన్ని చేపట్టింది అని జిల్లా కలెక్టర్ మను చౌదరి స్పష్టం చేశారు. రీ-సర్వే లో భాగంగా పాత రికార్డుల ఆధునీకరణ ఎలా జరగుతుందో వివరించారు. 1954 నాటి పాత సర్వే రికార్డుల సమాచారాన్ని సేకరించి, ప్రస్తుత కొత్త రీ-సర్వే వివరాలతో సరిపోల్చి నవీకరిస్తారని తెలిపారు .శాటిలైట్ సాంకేతికత ద్వారా ప్రతి భూభాగాని ఖచ్చితమైన భౌగోళిక కో-ఆర్డినేట్స్‌తో గుర్తించి, డిజిటల్ కో-ఆర్డినేట్స్‌తో కూడిన ప్రత్యేక నంబర్ కేటాయించి, రిజిస్టర్లలో నమోదు చేస్తారు అని తెలిపారు. ముందుగా గ్రామ సరిహద్దులు (పొలిమేరలు), ఊరి భాగాలు చెరువులు, ప్రభుత్వ భూములు పట్టా భూములను స్పష్టంగా వర్గీకరించి సరిహద్దులు ఖరారు చేస్తారని ఏ రోజు ఏ సర్వే నంబర్లలో కొలతలు తీస్తారో రైతులకు ముందస్తుగా నోటీసుల ద్వారా సమాచారం అందిస్తారని తెలిపారు.రోజుకు సుమారు 30 నుండి 40 ఎకరాల వరకు సర్వే పూర్తి చేస్తూ, నెల రోజుల్లో ఒక గ్రామాన్ని పూర్తిగా పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించమన్నారు.భు రీ- సర్వే వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలు వివరంగా తెలియజేశారు.సర్వే సమయంలోనే రైతుల సమక్షంలో 4 వైపులా మార్కింగ్ చేసి, సరిహద్దు సమస్యలు లేదా పొజిషన్ మార్పులు ఉంటే అక్కడికక్కడే పరిష్కరించుకునే అవకాశం ఉంటుంది.తల్లిదండ్రుల పేరు మీద ఉన్న భూములకు సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య సరిహద్దు వివాదాలు రాకుండా సరిగ్గా పంపిణీ చేసుకోవడానికి ఇది ఉపయోగపడుతుంది. ఒక సర్వే నంబర్‌లోని అందరూ హాజరైతే ఒకరి స్థానంలో మరొకరు తప్పు సమాచారం ఇచ్చే అవకాశం ఉండదు. ఏమైనా సమస్యలు ఉంటే రీ-సర్వే సమయంలోనే లేదా తర్వాత అర్జీ పెట్టుకుని పరిష్కరించుకోవచ్చు.రీ-సర్వే జరుగుతున్న సమయంలో ఆ సర్వే నంబర్‌కు సంబంధించిన ప్రతి ఒక్క రైతు ప్రత్యక్షంగా హాజరు కావాలి.ఒకవేళ పట్టాదారులు లేకపోతే వారి కుటుంబ సభ్యులు వచ్చి తమ భూములను చూపించవచ్చు.గ్రామ సభకు వచ్చిన వారు ఊరిలోని మిగతా రైతులకు కూడా ఈ సమాచారాన్ని తెలియజేసి సర్వే ప్రక్రియను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గ్రామస్థులకు/రైతులకు మనవి చేశారు.ఈ సదస్సు లో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్ రెడ్డి, కీసర ఆర్ డి ఓ, అడిషనల్ డైరెక్టర్ సర్వే ఆఫ్ లాండ్స్, కీసర ఎమ్ ఆర్ ఓ, సంబంధిత అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సదర్ అంటేనే యాదవుల ఆత్మగౌరవ ఉత్సవం

- **అఖిల భారత బెస్త మహాసభ ఏపీ అధ్యక్షుడు పీజీ వెంకటేష్ బెస్త**
- **హైదరాబాద్ గోల్కొండలో ఘనంగా సదర్ వేడుకలు**
- **బీసీ సంఘాల నాయకుల భారీ హాజరు.**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ నగరంలోని చారిత్రాత్మక గోల్కొండ పరిసరాల్లో సదర్ (దున్నల పండుగ) వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. యాదవుల ఆత్మగౌరవ ప్రతీకగా, సంస్కృతి సాంప్రదాయాల నడుమ నిర్వహించిన ఈ కార్యక్రమానికి వివిధ బీసీ సంఘాల అగ్రనేతలు, ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై సందడి చేశారు. సదర్ సంబరాల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు, కర్నూలు ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ సహా పలు కుల సంఘాల అధ్యక్షులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మాట్లాడిన బీసీ అధ్యక్షులు నాగేశ్వర రావు యాదవ్, బెస్త మహాసభ పుట్టగురు వెంకటేష్ బెస్తసదర్ పండుగ యాదవ సంస్కృతికి, వారి జీవన విధానానికి అద్దం పడుతుందని, తెలంగాణ ప్రభుత్వం దీనిని అధికారిక పండుగగా గుర్తించి ఘనంగా నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ వేడుకల్లో నాగేశ్వరరావు యాదవ్ తో పాటు జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతినిధి, సగర ఉప్పర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ లాయర్ ప్రసాద్ గారు, ప్రముఖ బీసీ సంఘాల నాయకులు బద్రి యాదవ్, రవి యాదవ్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొని పండుగ సందడిని పెంచారు.అలాగే, ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన బీసీ జ్యోతిష్య శాస్త్రవేత్త పుల్లయ్య స్వామి, బీసీ ఉద్యోగుల సంఘం అగ్రనాయకులు ఉప్పరి శివన్న సహా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు.ఈ సందర్భంగా గోల్కొండ ప్రాంతంలో రంగురంగుల అలంకరణలతో, డోలు వాయిద్యాలు, తీన్‌మార్ దరువుల మధ్య దున్నపోతుల ప్రదర్శన కన్నులపండువగా సాగింది. బీసీ సామాజిక వర్గాల హక్కులు, వారి ఐక్యతను చాటిచెప్పేలా సాగిన ఈ వేడుకల్లో బీసీ సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

వరంగల్ హోటళ్లలో అధికారుల దాడులు

విస్తుపోయే నిజాలు



వరంగల్ వరంగల్ హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ తనిఖీలతో కలకలం రేగాయి. మండి బజార్‌లో హోటళ్లలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు నిర్వహించారు. హోటళ్లలో సింథటిక్ రంగుల వినియోగం గుర్తించారు. బిర్యానీ, చికెన్ వంటకాల్లో కృత్రిమ రంగులు కలుపుతున్నట్లు అధికారులు నిర్ధారించారు. ఫ్రోజెన్ చికెన్ నిల్వ, అపరిశుభ్ర వంటగదులు ఆందోళనలు కలిగించాయి. ఆహార తయారీలో నిబంధనలు పాటించని హోటళ్లపై అధికారులు కొరడా ఝుళిపించారు. పలు ఆహార పదార్థాల నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రోడ్డెక్కిన ప్రజలు

హైదరాబాద్ రోడ్లపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హయత్ నగర్ డివిజన్ కి చెందిన 10 కాలనీల ప్రజలు రోడ్డుపై బైఠాయించి నిరసన ధర్నా చేపట్టారు. మూడు సంవత్సరాల క్రితం సాంక్షన్ అయిన డ్రైనేజీ పనులను ప్రారంభించకుండా అలసత్వం వహిస్తున్న అధికారులు వెంటనే వచ్చి సమస్య పరిష్కారం చేయాలని కాలని వాసులు డిమాండ్ చేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో హయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి పాల్గొని రోడ్డుపై స్థానిక ప్రజలతో కలసి బైఠాయించారు.పక్కనే ఉన్న స్కూల్ విద్యార్థులు డ్రైనేజీ వల్ల అనారోగ్యం పాలై అంటు రోగాలకు గురవుతున్నారన్నారు.ఈ డ్రైనేజీ వల్ల దాదాపు 15 కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారన్నారు.పలుమార్లు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన కాలయాపన చేయడం జరుగుతుందన్నారు.అధికారులు వెంటనే స్పందించి పనులు ప్రారంభించాలని జీవన్ రెడ్డి అన్నారు.అధికారులు సమస్యను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున రోడ్డుపై బైఠాయించి వంటావార్పు కార్యక్రమంను చేపడతామని హెచ్చరించారు.

లారీ ఢీకొట్టడంతో బస్సు బోల్తా..

డ్రైవర్‌కు గాయాలు

సంగారెడ్డి రామచంద్రపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని భీరాంగూడ కమాన్ వద్ద ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ని లారీ ఢీ కొట్టడంతో? ట్రావెల్ బస్సు బోల్తా పడింది. ఘటనలో బస్సు డ్రైవర్ సల్మాన్ (30) తలకు తీవ్రగాయాలు కావడంతో అతడిని ఆసుపత్రికి తరలించారు. ముందు వెళ్తున్న మినీ బస్సును ని లారీ అతివేగంగా వెనుక నుండి వచ్చి ఢీ కొట్టింది. లారీ డ్రైవర్ తప్పిదమే ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తుంది. మినీ బస్సు లో ప్రయాణికులు లేకపోవడం తో పెను ప్రమాదం తప్పింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్రేన్ సహాయంతో బోల్తా కొట్టిన బస్సును పక్కకు తొలగించి ట్రాఫిక్ ను క్లియర్ చేశారు.

విజయసాయిరెడ్డి కొత్త పార్టీ ప్రకటన..

- పరివర్తన రాజనీతి పార్టీ ఆవిర్భావం..



విజయవాడ విజయవాడ: మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి నూతన రాజకీయ పార్టీని ప్రకటించారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో బుధవారం ఉదయం 11 గంటల 11 నిమిషాలకు నిర్వహించిన కార్యక్రమంలో పరివర్తన రాజనీతి పార్టీ పేరును ప్రకటించారు. ఈ సందర్భంగా పార్టీ ఆవిర్భావానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు...

పట్టభద్రులను ఉద్యోగులుగా మార్చడమే లక్ష్యం..

- దుండ్ర కుమారస్వామి

హైదరాబాద్ మెహిదీపట్నంలోని గుడిమల్కాపూర్ కింగ్స్ ప్యాలెస్‌లో నిరుద్యోగులు, పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనం, జాబ్ మేళా?2026 నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి పాల్గొని యువత సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పట్టభద్రులను ఉద్యోగులుగా మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, నియామకాల్లో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా పలువురు పట్టభద్రులు హైదరాబాద్?రంగారెడ్డి? మహబూబ్‌న గర్ ఎమ్మెల్సీ నియోజకవర్గం నుంచి దుండ్ర కుమారస్వామి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన.. పట్టభద్రులు, నిరుద్యోగులు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను శాసనమండలిలో బలంగా వినిపిస్తానని హామీ ఇచ్చారు.

అప్పుల బాధతో కౌలు రైతు మృతి

నూజివీడు అప్పుల బాధతో కౌలు రైతు మృతి చెందిన సంఘటన. రెడ్డిగూడెం మండలం రంగాపురం పంచాయతీ పరిధిలో తాడిగూడెం గ్రామానికి చెందిన పట్టిన శివరామరావు (44) కౌలుకు పొలం తీసుకొని సాగు చేస్తున్నాడు. తనకున్న అప్పుల బాధతో మనస్తాపం చెంది పొలానికి వెళ్లి గడ్డి మందు తాగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108 ద్వారా నూజివీడులో ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. గత ఏడాది కౌలుకు తీసుకొని వేసిన పంటలు సరిగా పండలేదని, ఈ సంవత్సరం కూడా నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాడు. ఈ క్రమంలో అప్పుల బాధతో మనస్థాపానికి గురై పొలానికి వెళ్లి గడ్డి మందు తాగినట్లు భార్య వెంకటరమణ మంగళవారం రాత్రి రెడ్డిగూడెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతుడు శివరామరావు మృతదేహాన్ని పోస్టుమార్టం చేసి బుధవారం బంధువులకు అప్పగించనున్నట్లు రెడ్డిగూడెం ఎస్సై శ్రీను తెలిపారు. అయితే మృతుడుది స్వగ్రామం ఉయ్యూరు వద్ద కండ్రిక. మృతుడు తన మామగారైన తాటిగూడెం 20 సంవత్సరాల క్రితం వచ్చి జీవనం కొనసాగిస్తున్నాడు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు ఒకరికి పెళ్లి కాక, రెండవ కూతురు 10వ తరగతి చదువుతుంది.

31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు సర్వాంగ సుందరంగా ముస్తాబైన విశాఖ నగరం





విశాఖపట్నం 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సుకు విశాఖ నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్స్ లో 12,13 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు జరగనుంది. ఏపీ సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా విదేశీ అతిథులకు స్వాగతం పలికేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. గిరిజన థింసా డాన్స్, గరగ నృత్యం, తప్పెట గుళ్ళు తదితర సంప్రదాయాలను తెలియచేసేలా ఏర్పాటు చేసారు. ఏటి కొప్పాక, కొండపల్లి బొమ్మలు, తోలుబొమ్మలాట కూచిపూడి లాంటి సాంప్రదాయ కళల్ని ప్రదర్శించేలా అలంకరణలు చేసారు. ఏపీ తీర ప్రాంతం, ఏపీ ఆతిథ్యం, రుచులు, అమరావతి వైభవం, నూతన రాజధాని, కడియం నర్సరీ లాంటి ప్రత్యేకతలను ప్రదర్శించేలా కళాకృతులు తీర్చిదిద్దారు. రాష్ట్రంలో వనరులు, పెట్టుబడి అవకాశాలను పారిశ్రామిక వేత్తలకు తెలియ చెప్పేలా వ్యవసాయం, ఉద్యాన పంటలు, అరకు కాఫీ, టూరిజం, లాజిస్టిక్స్, సోలార్ తదితర అంశాలను చాటి చెప్పేలా స్టాల్లు, కళాకృతులు రూపొందించారు. ప్రధాన ప్లీనరీ హాల్ తో పాటు పారిశ్రామిక వేత్తలు చర్చలు జరిపేలా వివిధ సమావేశ ప్రాంగణాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. దిగ్గజ కంపెనీల చైర్మన్లు, సీఈఓలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం అయ్యి చర్చలు జరిపేందుకు వీలుగా మరో ప్రత్యేక హాల్ సిద్ధం అయ్యాయి. బిజినెస్ టూ బిజినెస్, గవర్నమెంట్ టు బిజినెస్ చర్చల కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తయ్యాయి. భాగస్వామ్యాలు, ఒప్పందాలు కుదుర్చుకునేందుకు వేర్వేరుగా ఏర్పాట్లు చరేసారు. ఒకేసారి రెండు, మూడు కార్యక్రమాలు నిర్వహించుకునేలా సమావేశ మందిరాలు అందుబాటులో వున్నాయి. ఈ సమావేశ మందిరాల్లో ప్రారంభ, ముగింపు కార్యక్రమాలతో పాటు ఆరు కీలకమైన అంశాలపై మేధో మధనం జరగనుంది.

విద్యాభివృద్ధి, లౌకికవాదం, జాతీయ సమైక్యతకు ఆజాద్ సేవలు చిరస్మరణీయం

తాడేపల్లి, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ.. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మౌలానా అబుల్ కలాం ఆజాద్, స్వతంత్ర భారత తొలి విద్యాశాఖ మంత్రిగా దేశ విద్యావ్యవస్థకు బలమైన పునాదులు వేశారని కొనియాడారు. విద్య ద్వారానే సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం సాధ్యమవుతాయని విశ్వసించిన గొప్ప దార్శనికుడని పేర్కొన్నారు. దేశంలో విద్యావ్యాప్తికి, ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి ఆజాద్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. మతసామరస్యం, లౌకికవాదం, జాతీయ సమైక్యత కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ నాణ్యమైన విద్య అందాలన్న ఆజాద్ ఆశయాలు నేటికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ ప్రగతికి, దేశాభివృద్ధికి పునాది అని ఆజాద్ బలంగా విశ్వసించారని జగన్ స్మరించుకున్నారు. ఆయన ఆలోచనలు భావితరాలకు మార్గదర్శకమని, ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుకోవడం విద్యారంగానికి ఆయన అందించిన సేవలకు గుర్తింపు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, మైనార్టీ నాయకులు మహ్మద్ రుహుల్లా, డాక్టర్ మెహబూబ్ షేక్, షరీఫ్, దస్తగిరి, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్నే ఆకట్టుకుంటున్న సదర్..

- మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్ నారాయణగూడ సర్కిల్ లో యాదవ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ వేడుకలకు మాజీమంత్రి, బిఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరయ్యారు. తలసాని మాట్లాడుతూ దీపావళి పర్వదినం తర్వాత సదర్ ను ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుంది. నీతి నిజాయితీ లకు పేరుగాంచిన యాదవులు 364 రోజుల పాటు తమ పాడి వృత్తి లో ఉంటూ సంవత్సరంలో ఒకరోజు సదర్ జరుపుకుంటారు. అన్ని వర్గాల ప్రజలు ప్రతి సంవత్సరం నిర్వహించే సదర్ ను ఎంతో ఆదరిస్తున్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాల నుండి దున్నపోతులను తీసుకొచ్చి ప్రదర్శించడం సదర్ ప్రత్యేకత. యాదవులు లేనిదే చరిత్ర లేదని రామాయణం, మహాభారతం చెబుతున్నాయని అన్నారు.

ఎయిర్ ఇండియా విమానానికి

హైజాక్ బెదిరింపు

- కోల్‌కతాలో కలకలం

కోల్‌కతా: కోల్‌కతా నుంచి ముంబై వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానంలో హైజాక్ బెదిరింపు లేఖ కలకలం రేపింది.విమానం బయలుదేరే ముందు పైలట్ ఈ బెదిరింపు నోట్‌ను గుర్తించి ఏటీసీ అధికారులకు సమాచారం అందించారు.(అప్రమత్తమైన భద్రతా సిబ్బంది వెంటనే ప్రయాణికులందరినీ విమానం నుంచి కిందకు దించారు. ప్రస్తుతం విమానంలో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.భద్రతా కారణాలతో విమానాన్ని నిలిపివేశారు. బెదిరింపు లేఖపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

పసికందును కాలువలో

పారేసిన కసాయిలు

విశాఖపట్నం విశాఖపట్నం మద్దిలపాలెం సమీపంలోని పిఠాపురం కాలనీలో నవజాత శిశువును తల్లిదండ్రులు కాల్వలో పడేసి వెళ్లిపోయారు. డ్రైనేజీలో నుంచి పసికందు ఏడుపు వినిపించడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. అక్కడి గోనె సంచిలో శిశువును గుర్తించి ఎంవీపీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు శిశువును ఆసుపత్రికి తరలించారు.

రైతుల అభివృద్ధి కోసం కృషి చేస్తా

- వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మేడిపల్లి దేవానందం

- అతిథులకు పుష్పగుచ్ఛం, సన్మానంతో ఆహ్వానించిన మార్కెట్ కమిటీ సభ్యులు



ఎల్లారెడ్డిపేట(ప్రశ్న న్యూస్) బొప్పాపూర్ గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుల పరిచయ వేదికకు ముఖ్య అతిథులు వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్, గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్ రావడంతో వీరిని మార్కెట్ కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛం, శాలువాలతో సన్మానించి ఆహ్వానాలు పలికారు.

వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మేడిపల్లి దేవానందం మాట్లాడుతూ రైతుల పట్ల మా యొక్క బాధ్యతలు అలంకారప్రాయం కాకుండా రైతులకు ఎలాంటి సమస్యలు వచ్చినా ఎల్లప్పుడూ ముందుంటామని, రైతులకు సేవ చేయడానికి ఇచ్చిన అవకాశాన్ని వమ్ము చేయకుండా శిరసా వహిస్తామని తెలిపారు, ఎలాంటి సమస్యలు ఉన్న అహర్నిశలు శ్రమిస్తామని, మా తల్లిదండ్రులు కూడా రైతులేనని, మేము కూడా రైతు కుటుంబం నుంచి వచ్చామని, రైతుల కష్టాలు తెలుసని, రైతులను రైతులాగా కాకుండా సొంత తల్లిదండ్రులు లాగా చూస్తామని, తన సోదరుడు మేడిపల్లి సత్యం ఎన్నో కష్టాలు అనుభవించి చొప్పదండి నియోజకవర్గం లో ఎమ్మెల్యే స్థానంలో కొనసాగుతూ, నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని, తన పేరుకు, కాంగ్రెస్ పార్టీకి, కార్యకర్తలకు ఎలాంటి భంగం కలగకుండా,రైతుల కోసం పాటుపడతానని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు రైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలతోపాటు ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని, రాష్ట్రం ఆర్థికంగా వెనుకబడి ఉన్న అభివృద్ధిని కొనసాగిస్తున్నారని, అర్హులకు రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు,ఉచిత విద్యుత్, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లను అందిస్తున్నారని, రైతులకు 500 బోనస్ కూడా ఇస్తున్నారని, మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుందని, కాంగ్రెస్ పార్టీ యొక్క సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తామని, వైస్ చైర్మన్, డైరెక్టర్లతో కలిసి రైతులకు తోడుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, బొప్పాపూర్ సర్పంచ్ ఇల్లెందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, గ్రామస్తులు, మరియు ఇతర గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఈ యొక్క కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఏడుగుళ్ల దేవాలయం తొలగింపుపై పట్టణ ప్రజలు ఆగ్రహం

- 200 ఏళ్ల చరిత్రకు చేరాపెట్టొద్దు

- జాతీయ రహదారి విస్తరణ పేరుతో ఆలయానికి నోటీసులు..

తొలగింపును అడ్డుకుంటామంటున్న ఆలయ కమిటీ సభ్యులు



మేడ్చల్ (ప్రశ్న న్యూస్)మేడ్చల్ పట్టణంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఏడుగుళ్ల దేవాలయం తొలగింపు అంశం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా దేవాలయాన్ని తొలగించేందుకు సంబంధిత అధికారులు నోటీసులు జారీ చేయడంతో పట్టణంలో నిరసనలు వ్యక్తమవుతున్నాయి.ఆలయ తొలగింపును వ్యతిరేకిస్తూ బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు దేవాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ దేవాలయం పట్టణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సంప్రదాయాలతో ముడిపడి ఉందని వారు పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిరసనకారులు మాట్లాడుతూ.. తరతరాలుగా ప్రజల ఆరాధనకు కేంద్రంగా ఉన్న ఆలయాన్ని తొలగించాలనే నిర్ణయాన్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల పేరుతో చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యత కలిగిన ఆలయాన్ని తొలగించడం వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ఏడుగుళ్ల దేవాలయం ఇక్కడే కొనసాగించాలని, ఆలయాన్ని తొలగించే నిర్ణయాన్ని అధికారులు పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. ప్రజల విశ్వాసాలను గౌరవిస్తూ ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని కోరారు.

అభివృద్ధి అవసరమే..

ఆధ్యాత్మిక వారసత్వం కూడా ముఖ్యమే!

జాతీయ రహదారి విస్తరణతో పాటు పట్టణ చారిత్రక కట్టడాలు, ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి ఆలయ కమిటీ సభ్యులతో చర్చించి సమస్యకు సామరస్యపూర్వక పరిష్కారం చూపుతారా అన్నది వేచి చూడాలి.

పిడుగురాళ్లలో సిపిఎం పార్టీ నిరసన కార్యక్రమం

పిడుగురాళ్ల ఇటీవల జరిగిన మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వ అక్రమాలను, దౌర్జన్యాలను ఎండ కట్టాలని, ప్రజాస్వామ్య హితంగా ఎన్నికలు జరపాలని కోరుతూ వామపక్ష పార్టీలు ఇచ్చిన పిలుపు మేరకు, పిడుగురాళ్ల పట్టణంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం సర్ విధానాన్ని తీసుకొచ్చి సామాన్యులు యొక్క 13 కోట్ల ఓట్లు తొలగించిందని, సామాన్యుడు కు ఓటు వేసే హక్కు లేకుండా చేసిందని ఆయన విమర్శించారు. అదేవిధంగా రాష్ట్రంలో ఇటీవల జరిగిన మున్సిపల్, జడ్పిటిసి, ఎంపీటీసీ, ఎన్నికల సందర్భంగా ప్రత్యర్థుల నామినేషన్ పత్రాలను సించివేయడం, ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఏజెంట్లను బయటకి నెట్టేసి, రిగ్గింగ్ చేసుకోవడం, ఎన్నికలు జరగకుండానే ఏకగ్రీవాలు చేసుకోవడం వంటి అనేక దౌర్జన్యాలకు పాల్పడిందని దీనినే ప్రజాస్వామ్యం అని చెప్పుకోవటం కూటమి ప్రభుత్వానికి సిగ్గుచేటని ఆయన విమర్శించారు. భవిష్యత్తులో జరగబోయే స్థానిక పంచాయతీ, మిగిలిన ఎన్నికలు జరపవలసిన ప్రాంతాల్లో ఎన్నికలు సజావుగా , ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరపాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, పట్టణ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, దేవుళ్ళ భూలక్ష్మి, షేక్ బాబు, సంపత్ వెంకటకృష్ణ, మిాసాల జయరాజు, కృష్ణ , జగ్గం శెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బతికున్న రైతును రికార్డుల్లో చంపేశారు


- 16 నెలలుగా రైతు భరోసాకు మంగళం- తాను బతికే ఉన్నానంటూ అధికారుల చుట్టూ బాధితురాలి ప్రదక్షిణలు

- సి ఆర్ ఎస్ పోర్టల్‌లో మరణించినట్లు నమోదు.. రైతు భరోసా జాబితాలో అనర్హురాలిగా ముద్ర

- పి జి ఆర్ ఎస్ లో ఫిర్యాదు చేసినా పరిష్కారం శూన్యం.. జేసీకి మరోసారి మొర







ఇబ్రహీంపట్నం (ప్రశ్న న్యూస్) బతికున్న మనిషిని ప్రభుత్వ రికార్డుల్లో చనిపోయినట్లు నమోదు చేస్తే ఎలా ఉంటుంది? తాను బతికే ఉన్నానని నిరూపించుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి వస్తే..? ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దాములూరు గ్రామానికి చెందిన మహిళా రైతు యలమంచిలి నాగమణికి ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితి ఇదే! అధికారుల రికార్డుల్లో ఆమె మరణించినట్లు నమోదవడంతో గత 16 నెలలుగా రైతు భరోసా (అన్నదాత సుఖీభవ) సాయం నిలిచిపోయింది. బతికున్న రైతును రికార్డుల్లో చనిపోయినట్లు చూపించిన ఈ వ్యవహారం రెవెన్యూ, వ్యవసాయ శాఖల పనితీరుపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతోంది.

బతికుండగానే మరణించినట్లు ముద్ర..

దాములూరు గ్రామానికి చెందిన యలమంచిలి నాగమణి (భర్త శ్రీనివాసబాబు) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గతంలో ఆమెకు క్రమం తప్పకుండా రైతు భరోసా ఆర్థిక సాయం అందేది. అయితే గత 16 నెలలుగా ఆమె ఖాతాలో నగదు జమ కావడం నిలిచిపోయింది. ఎందుకు డబ్బులు రావడం లేదని ఆరా తీస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చింది. సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ పోర్టల్‌లో నాగమణి మరణించినట్లు నమోదు కావడంతో రైతు భరోసా పథకంలో ఆమె పేరును అనర్హుల జాబితాలోకి చేర్చినట్లు తెలిసింది. బతికున్న మహిళను ప్రభుత్వ రికార్డుల్లో మరణించినట్లు ఎవరు నమోదు చేశారు? ఏ ఆధారాలతో ఈ నమోదు జరిగింది? క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండానే ఇలాంటి పొరపాటు జరిగిందా? అన్న ప్రశ్నలు ఇప్పుడు తలెత్తుతున్నాయి.

ఫిర్యాదు చేసినా ఫలితం ఏది..

రికార్డుల్లో జరిగిన తప్పిదాన్ని సరిచేయాలని నాగమణి అధికారులను పలుమార్లు వేడుకున్నట్లు చెబుతున్నారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంతో 04-08-2026న మండల స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పి జి ఆర్ ఎస్)లో ఫిర్యాదు చేశారు. ఆమెకు NT=20260804487 గ్రీవెన్స్ నంబరు కేటాయించారు.ఫిర్యాదుపై విచారణ జరిపి క్షేత్రస్థాయిలో వాస్తవాలను నిర్ధారించి రికార్డులను సరిచేయాల్సి ఉంది. కానీ ఎంఆర్వో, వీఆర్వో స్థాయిలో అవసరమైన విచారణ, రికార్డుల నవీకరణ జరగలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో కార్యాలయాల చుట్టూ తిరగడమే ఆమెకు మిగిలిందని వాపోతున్నారు.

జేసీకి మరోసారి కన్నీటి వినతి..

స్థానిక స్థాయిలో సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో 10-11-2026న ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి మరోసారి వినతిపత్రం సమర్పించారు.

CRS పోర్టల్‌లో తన పేరుపై నమోదైన మరణ వివరాలను పరిశీలించి, తాను జీవించి ఉన్నట్లు ధ్రువీకరించి రికార్డులను సరిచేయాలని కోరారు. గత 16 నెలలుగా నిలిచిపోయిన రైతు భరోసా నిధులను కూడా అర్హత, నిబంధనల ప్రకారం మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

అధికారుల నిర్లక్ష్యానికి బాధ్యులెవరు..

ఒకవైపు రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్న పాలకులు.. మరోవైపు బతికున్న రైతు ప్రభుత్వ రికార్డుల్లో మరణించినట్లు నమోదై సాయం కోల్పోతుంటే బాధ్యత ఎవరిది? ఒక చిన్న రికార్డు తప్పిదాన్ని సరిచేయడానికి 16 నెలలు కావాలా? ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీ పెట్టుకున్నా చర్యలు ఎందుకు కనిపించడం లేదు? క్షేత్రస్థాయి అధికారులు బాధితురాలి ఇంటికి వెళ్లి వాస్తవాలు నిర్ధారించలేరా? ఈ ప్రశ్నలకు సంబంధిత శాఖల అధికారులు సమాధానం చెప్పాల్సి ఉంది.జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఈ వ్యవహారంపై ప్రత్యేకంగా దృష్టి సారించి సి ఆర్ ఎస్ మరణ నమోదు వెనుక కారణాలను గుర్తించడంతోపాటు బాధ్యులపై విచారణ జరిపించాలని స్థానికంగా డిమాండ్ వినిపిస్తోంది.

నాగమణి సమస్యను తక్షణమే పరిష్కరించి, ఆమెకు న్యాయం చేయాలని కోరుతున్నారు.ఒక రైతు బతికున్నానని నిరూపించుకోవాల్సిన దుస్థితి రావడం కంటే అధికార యంత్రాంగానికి సిగ్గుచేటు ఏముంటుంది? రైతు సంక్షేమ పథకాల అమలులో ఇలాంటి రికార్డుల తప్పిదాలకు ఇకనైనా అడ్డుకట్ట పడుతుందా? అన్నదే ఇప్పుడు దాములూరు గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

ఆరు నెలలుగా రోడ్డుపైనే మార్కెట్ వ్యాపారులు!

-మార్కెట్ కూల్చివేతతో పేద చిరు వ్యాపారుల బతుకులు రోడ్డున.

- కొత్త మార్కెట్ నిర్మాణం ఎప్పుడో?

- కూరగాయలు, చేపలు, మాంసం విక్రయించే వారికి ఉపాధి కరువు

- స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి

- మార్కెట్ నిర్మాణ పనులు చేపట్టాలని వ్యాపారుల వేడుకోలు...

- పల్లెల నుంచి వచ్చే రైతులు, చిరు వ్యాపారులకు నిలువ నీడ లేక ఇబ్బందులు





మంథని(ప్రశ్న న్యూస్) స్థానికంగా ఉన్న కూరగాయల మార్కెట్, చేపల మార్కెట్, మాంసం విక్రయ మార్కెట్లను కూల్చివేసి దాదాపు ఆరు నెలలు గడుస్తున్నా, ఇప్పటివరకు నూతన మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడంతో చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుంది? తిరిగి ఎప్పుడు తమకు వ్యాపారం చేసుకునే అవకాశం కల్పిస్తారు? అని వ్యాపారులు ప్రశ్నిస్తున్నారు.

రోడ్డుపాలైన చిరు వ్యాపారుల కుటుంబాలు

రోజువారీ కూరగాయలు, చేపలు, మాంసం విక్రయించుకుంటూ జీవనం సాగించే పేద కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారింది. మార్కెట్ కూల్చివేతతో వ్యాపారాలు చేసుకునే స్థలం లేక కొందరు రోడ్ల పక్కన, మరికొందరు అందుబాటులో ఉన్న ఖాళీ ప్రదేశాల్లో వ్యాపారాలు నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరైన స్థలం లేకపోవడంతో వ్యాపారాలు సరిగా సాగక కుటుంబ పోషణ భారంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పల్లెల నుంచి వచ్చే రైతులకు ఎక్కడ స్థలం?

చుట్టుపక్కల గ్రామాల నుంచి తెల్లవారుజామునే కూరగాయలు తీసుకొచ్చి విక్రయించి తిరిగి తమ గ్రామాలకు వెళ్లే చిన్న రైతులు, మహిళా వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్‌లో సరైన స్థలం లేకపోవడంతో ఎక్కడ కూర్చొని అమ్ముకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. రోజువారీ సంపాదనపై ఆధారపడి జీవించే వారి కుటుంబాలకు ఉపాధి



దెబ్బతింటోంది.ఆరు నెలలైనా నిర్మాణం ఎందుకు ఆలస్యం? మార్కెట్‌ను కూల్చివేసే సమయంలో నూతన మార్కెట్ నిర్మాణంపై ఏమైనా ప్రణాళికలు ఉన్నాయా? ఉంటే పనులు ఎందుకు ప్రారంభం కాలేదు? నిధుల సమస్యా, అధికారిక అనుమతుల సమస్యా? లేక ఇతర కారణాలా? అనే ప్రశ్నలు వ్యాపారుల్లో వ్యక్తమవుతున్నాయి. మార్కెట్ నిర్మాణానికి సంబంధించిన ప్రస్తుత పరిస్థితిని అధికారులు ప్రజలకు స్పష్టంగా తెలియజేయాల్సిన అవసరం ఉంది.

ఎమ్మెల్యే, అధికారులు స్పందించాలి

స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు మార్కెట్ వ్యాపారుల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. నూతన మార్కెట్ నిర్మాణం ఎప్పుడు ప్రారంభిస్తారు? ఎప్పటిలోగా పూర్తి చేస్తారు? అప్పటివరకు చిరు వ్యాపారులకు తాత్కాలికంగా ఎక్కడ వ్యాపారాలు చేసుకునే అవకాశం కల్పిస్తారు? అనే విషయాలపై స్పష్టమైన హామీ ఇవ్వాలి.ప్రభుత్వ అభివృద్ధి పనుల వల్ల పేదల ఉపాధి దెబ్బతినకూడదు. మార్కెట్ భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు వ్యాపారులు, చిన్న రైతులు నష్టపోకుండా ప్రత్యామ్నాయ స్థలాన్ని ఏర్పాటు చేయడం అధికారుల బాధ్యత. రోజూ కష్టపడి నాలుగు రూపాయలు సంపాదించుకొని కుటుంబాలను పోషించుకునే పేద చిరు వ్యాపారుల కన్నీటి గోడును స్థానిక ఎమ్మెల్యే, అధికారులు అర్థం చేసుకొని తక్షణమే పరిష్కార మార్గం చూపాలని మార్కెట్‌పై ఆధారపడి జీవించే ప్రజలు కోరుతున్నారు.

మెగాస్టార్ ఫ్యాన్స్‌కు గుడ్ న్యూస్

సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్న వశిష్ఠ!



మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న భారీ సోషియో ఫాంటసీ చిత్రం 'విశ్వంభర' గురించి గత కొంతకాలంగా రకరకాల వార్తలు వినిపిస్తున్నాయి. బింబిసార ఫేమ్ వశిష్ఠ మల్లిడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాపై మొదట్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. అయితే షూటింగ్, గ్రాఫిక్స్, ఇతర నిర్మాణానంతర కార్యక్రమాల కారణంగా సినిమా విడుదల ఆలస్యమవుతూ వస్తోంది. ఇప్పటివరకు విడుదల తేదీపై స్పష్టత లేకపోవడంతో మెగా అభిమానుల్లో కొంత నిరాశ నెలకొంది. ఈ నేపథ్యంలో తాజాగా సినిమాకు సంబంధించిన ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ బయటకు వచ్చింది. చిత్రంలో నటిస్తున్న నటుడు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో షేర్ చేసిన ఓ ఫొటోతో 'విశ్వంభర' పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయో వెల్లడైంది. 'విశ్వంభర' సినిమా పరిస్థితి ఏమిటి? షూటింగ్ పూర్తయిందా? పోస్ట్ ప్రొడక్షన్ పనులు ఎక్కడి వరకు వచ్చాయి? అనే సందేహాలు చాలాకాలంగా అభిమానులను వెంటాడుతున్నాయి. ఈ ప్రశ్నలకు సమాధానమిచ్చేలా నటుడు ప్రవీణ్ కుమార్ తాజాగా డబ్బింగ్ సెషన్‌కు సంబంధించిన ఫొటోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. దీంతో ఆయన ఈ సినిమాలో భాగమనే విషయం మరోసారి స్పష్టమైంది. అంతేకాకుండా సినిమా నిర్మాణానంతర కార్యక్రమాలు కూడా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.ఎలాంటి హడావుడి లేకుండా చిత్రబృందం సైలెంట్‌గా పనులు పూర్తి చేస్తున్నట్లు ఈ పరిణామం సూచిస్తోంది. ముఖ్యంగా డబ్బింగ్ కార్యక్రమాలు జరుగుతున్నాయనే విషయం అభిమానులకు కొంత ఊరటనిచ్చింది. అయితే సినిమా విడుదల తేదీపై మాత్రం ఇంకా అధికారిక ప్రకటన రాలేదు. ఈ సినిమాలో మెగాస్టార్ చిరంజీవికి జోడీగా అందాల తార త్రిష కృష్ణన్ నటిస్తున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో గతంలో వచ్చిన సినిమాలు ప్రేక్షకులను అలరించడంతో 'విశ్వంభర'లో వీరి జంట ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది. ఇక ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు కునాల్ కపూర్, ఆశికా రంగనాథ్, రమ్య పసుపులేటి, ఈషా చావ్లా, ఆశ్రిత వేముగంటి నందూరి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. విభిన్నమైన పాత్రలు, భారీ తారాగణంతో ఈ సినిమాను రూపొందిస్తున్నారు. 'బింబిసార' సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వశిష్ఠ మల్లిడి.. ఇప్పుడు చిరంజీవితో 'విశ్వంభర' వంటి భారీ సోషియో ఫాంటసీ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. సాధారణ కమర్షియల్ సినిమాలకు భిన్నంగా అద్భుతమైన ప్రపంచం, మాయాజాలం, ఫాంటసీ అంశాలు, భారీ విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

సిద్ధు జొన్నలగడ్డ 10వ సినిమా ప్రారంభం
సుకుమార్ రైటింగ్స్‌తో చేతులు కలిపిన స్టార్ బాయ్!



టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలు, తనదైన కామెడీ టైమింగ్, యూత్‌ను ఆకట్టుకునే నటనతో గుర్తింపు పొందిన సిద్ధు.. తన కెరీర్‌లో 10వ సినిమాను అధికారికంగా ప్రారంభించారు. 'సిద్ధు 10' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రారంభోత్సవ వేడుక హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ ప్రాజెక్ట్ కోసం సిద్ధు జొన్నలగడ్డ.. సుకుమార్ రైటింగ్స్, బన్నీ వాస్ వర్క్స్ సంస్థలతో చేతులు కలపడం విశేషం.ఈ సినిమాను మోహన్ బి దర్శకత్వం వహిస్తున్నారు. ఒక అందమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ సతీమణి తబిత సుకుమార్ ఈ సినిమాను సమర్పిస్తున్నారు. ప్రారంభోత్సవంతోనే ఈ ప్రాజెక్ట్‌పై సినీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుండగా, సినిమా టైటిల్‌తో పాటు ఇతర వివరాలను మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు. సిద్ధు జొన్నలగడ్డ 10వ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు హాజరై చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలో దర్శకుడు బుచ్చిబాబు సానా సినిమా స్క్రిప్ట్‌ను చిత్రబృందానికి అందజేశారు. ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేసి ప్రాజెక్ట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాతలు ధీరజ్ మొగిలినేని, వంశీ నందిపాటి తదితరులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు కలిసి ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తుండటం, ప్రారంభోత్సవానికి పలువురు సినీ ప్రముఖులు హాజరవడం సినిమాపై ఆసక్తిని పెంచుతున్నాయి. అయితే ఈ చిత్రానికి సంబంధించిన కథాంశం, సిద్ధు పాత్ర స్వభావం వంటి వివరాలను మాత్రం చిత్రబృందం ఇంకా వెల్లడించలేదు. సిద్ధు జొన్నలగడ్డ అంటే ప్రేక్షకులకు ముందుగా గుర్తొచ్చేది ఆయన ప్రత్యేకమైన నటన, కామెడీ టైమింగ్, యూత్‌ఫుల్ పాత్రలు. ముఖ్యంగా 'డీజే టిల్లు'తో ఆయనకు యువతలో విపరీతమైన క్రేజ్ ఏర్పడింది. ఆ తర్వాత కూడా తనదైన శైలిలో విభిన్నమైన సినిమాలను ఎంచుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇప్పుడు తన పదో చిత్రంలో ఒక అందమైన ప్రేమకథతో ప్రేక్షకులను పలకరించబోతుండటం ఆసక్తికరంగా మారింది. ప్రేమకథా చిత్రాలకు ఉండే భావోద్వేగాలు, వినోదం, సంగీతం వంటి అంశాలను దర్శకుడు మోహన్ బి ఎలా మలచనున్నారనేది ఆసక్తిని రేకెత్తిస్తోంది. సిద్ధు ఇమేజ్‌కు తగ్గట్టుగా ఈ కథలో కొత్తదనం ఉంటుందా? ఆయన పాత్రలో ఎలాంటి ప్రత్యేకత ఉండబోతోంది? అనే ప్రశ్నలకు సమాధానం తెలియాలంటే మరికొంతకాలం వేచి చూడాల్సిందే.

మేఘాల సంద్రంలో..



వంశీ నందిపాటి ఎంటర్‌టైన్మెంట్స్, ఈటీవీ విన్ కలిసి నిర్మిస్తున్న చిత్రం 'ఇంకా ఏం అనుకోలేదు!'. అక్షయ్ లగుసాని, కేయూరి జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి ప్రణయ్ వల్లూరిపల్లి, గిరి పెమ్మసాని కలిసి దర్శకత్వం వహించారు. డిసెంబర్ 11న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా 'మేఘాలు సంద్రంలో' అంటూ సాగే ఈ సినిమాలోని గీతాన్ని మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈవెంట్‌లో విడుదల చేశారు. 'అందరికీ రిలేట్ అయ్యేలా ఈ సినిమా ఉంటుంది. గిరి, ప్రణయ్ చెప్పిన కథ నాకెంతో నచ్చింది. వీరిద్దరూ ఇండస్ట్రీ గుర్తుపెట్టుకునే దర్శకులవుతారు' అని చిత్ర నిర్మాత వంశీ నందిపాటి అన్నారు. సాంకేతికంగా అన్ని విధాలా సినిమా బావుంటుందని దర్శకులు ప్రణయ్ వల్లూరిపల్లి, గిరి పెమ్మసాని చెప్పారు. సినిమాలో భాగం కావడం పట్ల కథానాయకుడు అక్షయ్ లగుసాని, కథానాయిక కేయూరి ఆనందం వెలిబుచ్చారు. ఇంకా ఈటీవీ ప్రతినిధులు భరణ్, సాయికృష్ణతోపాటు చిత్రబృం దమంతా మాట్లాడారు.

బాలీవుడ్‌కు దూరమవుతున్నప్రియాంక చోప్రా



గ్లోబల్ స్టార్‌గా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న బాలీవుడ్ నటి ప్రియాంక చోప్రా జానాస్ మరోసారి భారతీయ సినీ పరిశ్రమలో తనదైన ముద్ర వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా టాలీవుడ్‌లోకి ఆమె రీ ఎంట్రీ ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'వారణాసి'లో ప్రియాంక కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమా ద్వారా చాలా ఏళ్ల తర్వాత దక్షిణాది ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఆమె.. ఇకపై తెలుగు సినిమాల్లోనూ వరుసగా నటిస్తారా? లేక మళ్లీ బాలీవుడ్ ప్రాజెక్టులకే పరిమితమవుతారా? అన్న ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి. అంతర్జాతీయ సినిమాలు, వెబ్ సిరీస్‌లతో బిజీగా ఉన్నప్పటికీ 'వారణాసి' వంటి భారీ ప్రాజెక్టుకు ఆమె అంగీకరించడం వెనుక కథలోని ప్రత్యేకత, రాజమౌళి దర్శకత్వ ప్రతిభ, సినిమాకు ఉన్న గ్లోబల్ స్కేల్ ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు.ప్రస్తుతం ప్రియాంక చోప్రా తన కెరీర్‌ను చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకుంటున్నారు. కేవలం స్టార్ హీరోల సినిమాలు, భారీ బడ్జెట్ ప్రాజెక్టులు అనే కోణంలో కాకుండా.. తన పాత్రకు ఎంత ప్రాధాన్యత ఉంది? కథలో తన పాత్ర ప్రభావం ఎంత? సినిమా అంతర్జాతీయ ప్రేక్షకులను ఆకట్టుకునే అవకాశం ఉందా? అనే అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టాలీవుడ్ నుంచి ఆమెకు మరిన్ని అవకాశాలు వచ్చే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నటనతో పాటు నిర్మాణ రంగంలోనూ ప్రియాంక చోప్రా తనదైన ముద్ర వేస్తున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ పర్పుల్ పెబుల్ పిక్చర్స్ ద్వారా విభిన్నమైన కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఈ క్రమంలోనే జాతీయ అవార్డు అందుకున్న మరాఠీ చిత్రం 'వెంటిలేటర్'కు సీక్వెల్‌గా 'వెంటిలేటర్ 2'ను ప్రకటించడం విశేషం. ప్రియాంక కేవలం హిందీ సినిమాలకే పరిమితం కావాలనే ఆలోచనలో లేరని స్పష్టమవుతోంది. విభిన్న భాషలు, విభిన్న కథలు, విభిన్న ప్రేక్షకులను చేరుకోవాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు ఆమె ప్రాజెక్టుల ఎంపికను బట్టి అర్థమవుతోంది.అయితే ప్రియాంక చోప్రా బాలీవుడ్‌లో మళ్లీ ఎప్పుడు నటిస్తారనే ప్రశ్న కూడా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు హిందీ చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయికగా కొనసాగిన ఆమె.. ప్రస్తుతం ఎక్కువగా హాలీవుడ్, అంతర్జాతీయ ప్రాజెక్టులపైనే దృష్టి సారిస్తున్నారు. దీంతో హిందీ సినిమాల్లో ఆమె కనిపించి చాలా కాలమైందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఈజీ మనీ తెచ్చిన తిప్పలు

'ఈ కథకు పర్‌ఫెక్ట్‌గా సరిపోయే టైటిల్ 'దొంగ కాదు కొడకా'. అయితే.. సెన్సార్‌వారు అభ్యంతరం చెప్పడంతో DNK'గా మార్చాం. ఇది ఆద్యంతం వినోదాన్ని పంచే ఎంటర్‌టైనర్. ఇందులో క్రైమ్ ఎలిమెంట్ ఉన్నప్పటికీ అది కూడా ఫన్‌గా ఉంటుంది' అని హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'ణచీఖ'. శ్రీను కంబాల దర్శకుడు. ప్రతిష్టాత్మక నిర్మాణ సంస్థ మైత్రీమూవీమేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 13న విడుదల కానున్నది. ఈసందర్భంగా హీరో మౌళి తనూజ్ ప్రశాంత్ మంగళవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. 'రవితేజగారు మా ట్రైలర్‌ని లాంచ్ చేయడం ఆనందంగా ఉంది. ప్రమోషనల్ టూర్‌లో ప్రేక్షకుల నుంచి కూడా మంచి స్పందన వస్తున్నది' అని మౌళి ఆనందం వెలిబుచ్చారు. 'ఈజీ మనీకి అలవాటు పడ్డ కుర్రాడి కథ ఇది. డబ్బులకోసం గ్యాంబ్లింగ్ చేయడం మొదలుపెడతాడు. ఈ క్రమంలో తను తీసుకునే నిర్ణయాల వల్ల అప్పుల్లో కూరుకుపోతాడు. ఆ అప్పుల నుంచి బయట పడేందుకు దొంగతనం చేస్తాడు. ఆ తర్వాత తను ఎలాంటి ఇబ్బందుల్లో ఎదుర్కొన్నాడు? అనేది ఇందులో ఆసక్తికరమైన అంశం. వినోదంతోపాటు ఇందులో అద్భుతమైన ట్విస్టులు ఉంటాయి' అని మౌళి తనూజ్ ప్రశాంత్ తెలిపారు.



తొలి వ్యాపారంలోనే
భారీ నష్టాలు

వెండితెరపై తన అందం, అభినయంతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న స్టార్ హీరోయిన్ సమంత.. ఇప్పుడు వ్యాపార రంగంలోనూ తనదైన ముద్ర వేస్తున్నారు. సినిమాల్లో వరుస విజయాలు అందుకుంటూ స్టార్ హీరోయిన్‌గా ఎదిగిన ఆమె, వ్యాపారవేత్తగానూ తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. అయితే ఈ ప్రయాణం పూలబాటలా సాగలేదని, తొలి వ్యాపార ప్రయత్నంలోనే ఎదురైన నష్టాలు తనకు ఎన్నో జీవిత పాఠాలు నేర్పాయని సమంత వెల్లడించారు. తాజాగా ఓ టాక్ షోలో పాల్గొన్న ఆమె తన వ్యాపార అనుభవాలు, పెట్టుబడులు, మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతు వంటి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సాధారణంగా సినీ పరిశ్రమలో స్టార్‌డమ్ సంపాదించిన సెలబ్రిటీలు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టినప్పుడు వారికి అంతా సులభంగానే సాగుతుందని చాలామంది భావిస్తుంటారు. కానీ సమంత విషయంలో మాత్రం తొలి వ్యాపార ప్రయత్నం ఆశించిన ఫలితాలను ఇవ్వలేదట. తన మొదటి వెంచర్ గురించి మాట్లాడుతూ, ఆ వ్యాపార భాగస్వామ్యం అనుకున్న స్థాయిలో విజయవంతం కాలేదని ఆమె వెల్లడించారు.

తొలి పెట్టుబడిలోనే నష్టాలను ఎదుర్కోవాల్సి వచ్చిందని, అయితే ఆ అనుభవాన్ని వైఫల్యంగా కాకుండా ఒక గొప్ప పాఠంగా భావించానని తెలిపారు. విజయాలు మనకు ఆనందాన్ని ఇస్తే, అపజయాలు మాత్రం మనలోని లోపాలను గుర్తించి మరింత బలంగా ఎదిగేలా చేస్తాయని ఆమె అభిప్రాయపడ్డారు. మొదటి వ్యాపారంలో ఎదురైన నష్టమే ఆ తర్వాత పెట్టుబడులు పెట్టే విషయంలో మరింత జాగ్రత్తగా, ఆలోచనాత్మకంగా వ్యవహరించేలా చేసిందని వివరించారు. మొదటి ప్రయత్నంలో ఎదురైన నష్టాలకు భయపడి సమంత వ్యాపార రంగానికి దూరం కాలేదు. అందుకు భిన్నంగా మరింత ఉత్సాహంతో కొత్త అవకాశాలను అన్వేషిస్తున్నారు. ప్రస్తుతం తాను దాదాపు పది విభిన్న స్టార్టప్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్లు ఆమె వెల్లడించారు. ఈ పెట్టుబడుల వెనుక కేవలం ఆర్థిక లాభాలు మాత్రమే కాకుండా, కొత్త ఆలోచనలకు ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశం కూడా ఉందని తెలుస్తోంది. ముఖ్యంగా యువ పారిశ్రామికవేత్తలు తమ ఆలోచనలను వ్యాపారాలుగా మార్చుకునేందుకు అవసర మైన ప్రోత్సాహం అందించడం తనకు సంతోషాన్నిస్తుందని సమంత పేర్కొన్నారు. సమంత పెట్టుబడులు పెట్టిన స్టార్టప్స్‌లో మరో ప్రత్యేకత ఉంది. దాదాపు ఎనిమిది సంస్థలకు మహిళలే నాయకత్వం వహిస్తున్నారట. మహిళా పారిశ్రామికవేత్తలతో కలిసి పనిచేయడం తనకు సరికొత్త అనుభవాన్ని అందిస్తోందని ఆమె తెలిపారు. వ్యాపార రంగంలో మహిళలు కూడా పురుషులతో సమానంగా రాణించగలరని, వారికి సరైన అవకాశాలు, ప్రోత్సాహం లభిస్తే అద్భుతాలు సృష్టించగలరని సమంత అభిప్రాయపడ్డారు.

మైలవరం, గొల్లపూడి పంచాయతీలపై కూటమి గురి

రెండు కీలక గ్రామాలకు సర్పంచ్ అభ్యర్థుల ప్రకటన

అభ్యర్థుల పేర్లు ప్రకటించిన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు



మైలవరం(ప్రశ్న న్యూస్) మైలవరం నియోజకవర్గంలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి మొదలైంది. ఎన్నికల సమరానికి కూటమి పార్టీలు తమ అభ్యర్థుల ఎంపికపై కసరత్తును ముమ్మరం చేశాయి. ఇందులో భాగంగా నియోజకవర్గ రాజకీయాల్లో ప్రాధాన్యం కలిగిన మైలవరం, గొల్లపూడి గ్రామాలకు కూటమి సర్పంచ్ అభ్యర్థులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు ప్రకటించారు.

మైలవరంలో జమీందారు కుటుంబం నుంచి..

మైలవరం గ్రామ సర్పంచ్ అభ్యర్థిగా జమీందారు కుటుంబానికి చెందిన ఎస్.వి.ఎన్. నివృత్తరావును ఎంపిక చేశారు. సంప్రదాయ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబానికి అవకాశం కల్పించడం ఈ ఎంపికలో ప్రత్యేకతగా నిలిచింది.

గొల్లపూడిలో బొమ్మసాని వారసుడికి అవకాశం..

విజయవాడ రూరల్ మండలంలోని కీలక గ్రామమైన గొల్లపూడి సర్పంచ్ అభ్యర్థిగా టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మసాని సుబ్బారావు కుమారుడు బొమ్మసాని జయంతి సాయిని ప్రకటించారు. పార్టీ సీనియర్ నాయకుడి కుటుంబం నుంచి యువ నాయకత్వానికి అవకాశం కల్పించినట్లు ఈ ఎంపిక ద్వారా స్పష్టమవుతోంది.రెండు గ్రామాల్లోనూ అభ్యర్థుల ప్రకటనతో స్థానిక రాజకీయ వర్గాల్లో ఎన్నికల చర్చ ఊపందుకుంది. కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

టెక్నాలజీ ఎంత పెరిగినా బ్లూకాలర్ ఉద్యోగాలకు ఢోకా లేదు

- ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా మారుస్తున్నామని వెల్లడి

- విద్య, నీటిపారుదలకు నెహ్రూ బలమైన పునాదులు వేశారని వ్యాఖ్య

- మైనారిటీల సంక్షేమానికి తమ ప్రభుత్వం కటుబడి ఉందని హామీ



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మూసీ రివర్ ఫ్రంట్ పనులు త్వరలోనే ప్రారంభం కాబోతున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. మూసీ రివర్ ఫ్రంట్ పరిసరాల్లో నైట్ ఎకానమీని అభివృద్ధి చేయడం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు.మూసీ రివర్ ఫ్రంట్‌ని అత్యంత సుందరమైన రివర్ ఫ్రంట్‌గా అభివృద్ధి చేయడమే కాకుండా నైట్ ఎకానమీ కార్యకలాపాలను విస్తరించడం ద్వారా రాష్ట్ర ఆర్థిక పురోభివృద్ధికి తద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు. హైదరాబాద్ నగర గత వైభవాన్ని ముఖ్యమంత్రి వివరిస్తూ ఓల్డ్ సిటీ కాదు ఒరిజినల్ సిటీని తిరిగి పునరుద్ధరించడం కోసం అడుగులు వేశామని చెప్పారు. దేశ విదేశాల నుంచి సందర్శకులు వచ్చేలా రివర్ ఫ్రంట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

- దేశంలో ఐఐటీల స్థాపనకు శ్రీకారం చుట్టిన మౌలానా అబుల్ కలాం

భారతదేశ తొలి విద్యా శాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర మైనారిటీ శాఖ హైదరాబాద్ బంజారా భవన్‌లో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవం, మైనారిటీ సంక్షేమ దినోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత పండిత్ నెహ్రూ విద్యకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారని గుర్తుచేశారు. విద్యా మంత్రిగా మౌలానా అబుల్ కలాం కాలంలోనే దేశంలో ఐఐటీల స్థాపనకు శ్రీకారం చుట్టబడిందని సీఎం రేవంత్ రెడ్డి గుర్తుచేశారు.

- ప్రపంచ వ్యాప్తంగా స్కిల్స్ ఉన్నవారికే ప్రాధాన్యత

మౌలానా అబుల్ కలాం ఆజాద్ హయాంలోనే దేశంలో విద్యా విధానానికి రూపకల్పన చేసి, ప్రముఖ విద్యా సంస్థల స్థాపనకు పునాదులు వేశారని, తద్వారా దేశ కీర్తి ప్రతిష్ఠలను పెంపొందించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మారుతున్న పరిస్థితుల్లో విద్య ఒక్కటే సరిపోదని, ప్రపంచ వ్యాప్తంగా స్కిల్స్ ఉన్నవారికే ప్రాధాన్యత దక్కుతోందని వివరిస్తూ మారుతున్న కాలానికి అనుగుణంగా యువత స్కిల్స్‌ను అందిపుచ్చుకోవాలన్న లక్ష్యంతో ఐటీఐలను ప్రభుత్వం ఏటీసీలుగా తీర్చిదిద్దినట్టు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు విద్యకు, ఆ తర్వాత స్కిల్స్ అనంతరం ఆవిష్కరణలకు ప్రాధాన్యతనిచ్చేలా విద్యా రంగంలో సంస్కరణలు చేపట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

- మైనారిటీలకు 4శాతం రిజర్వేషన్లు కల్పించాం

మైనారిటీ యువకుల్లో స్కిల్స్ ఉన్నవారు చాలా మంది ఉన్నారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. పిల్లను బాగా చదివించాలని, చదువుల పట్ల మక్కువ లేని వారికి స్కిల్స్ నేర్పించాలని లేదా వారిని క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. బ్లూకాలర్ జాబ్స్‌కు పెరుగుతున్న ప్రాధాన్యతను గుర్తించే రాష్ట్రంలో స్కిల్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ స్థాపించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. దేశ జనాభాలో 15 శాతం ఉన్న మైనారిటీ కూడా ప్రగతి సాధించినప్పుడే దేశం ముందడుగు వేస్తుందని వివరించారు. మైనారిటీల్లో పేదరికం తొలగించాలన్న ఉద్దేశంతో సచార్ కమిటీ సిఫారసులకు అనుగుణంగా 4 శాతం రిజర్వేషన్లు కల్పించినట్టు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

- హైదరాబాద్‌లో ఒక లక్ష ఇందిరమ్మ ఇండ్లు

'చదువు విషయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుంది. నిరుపేదల కోసం హైదరాబాద్‌లో ఒక లక్ష ఇందిరమ్మ ఇండ్లు నిర్మించబోతున్నాం. శాంతి భద్రతలు, అభివృద్ధి, విద్య, ఆరోగ్యం వంటి రంగాల్లో ప్రాధాన్యత ఇస్తున్నాం'అని అన్నారు. గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ పనులు వచ్చే రెండు నెలల్లో ప్రారంభం కానున్నాయని తెలిపారు. మీరాలం ట్యాంక్ మరో ఏడాది కాలంలో అత్యంత సుందరమైన ప్రదేశంగా రూపుదిద్దుకోబోతోందని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు.

మేడ్చల్ కలెక్టర్ మనూ చౌదరిపై హైకోర్టు ఆగ్రహం

- కోర్టులో హాజరుపరచాలని సీపీకి ఆదేశం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ భూముల పరిరక్షణ, ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకునే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మేడ్చల్– మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనూ చౌదరిపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బుధవారం నాటి విచారణకు ఆయన హాజరుకాకపోవడాన్ని న్యాయమూర్తి తీవ్రంగా పరిగణించారు. దీంతో కలెక్టర్‌ను నేరుగా న్యాయస్థానంలో హాజరుపరచాలని మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌ను జడ్జి ఆదేశించారు. కాగా, కోర్టు ఉత్తర్వులను ధిక్కరించిన కేసులో ఇటీవలే రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి హైకోర్టు 6 నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.2 వేల జరిమానా విధించిన విషయం తెలిసిందే. జస్టిస్ కె. లక్ష్మణ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆదేశాలు ఇచ్చింది. ఈ తీర్పు వెలువడిన రెండు రోజుల్లోనే మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్‌పై కూడా తెలంగాణ హైకోర్టు తీవ్రంగా స్పందించడం కలకలం రేపుతోంది. ఇది రాజకీయ వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. వరుసగా బ్యూరోక్రాట్లు న్యాయస్థానాల ఆగ్రహానికి గురికావడం ఆందోళన కూడా వ్యక్తమవుతోంది. న్యాయస్థానాలు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నందున, అధికారులు ఈ విషయంలో బాధ్యత వహించాలి అనే చర్చలు పెరుగుతున్నాయి. ప్రభుత్వ భూముల రక్షణకు సంబంధించిన సమస్యలను హైకోర్టు చర్యలు స్పష్టంగా చూపిస్తున్నాయి. ఈ కేసు తెలంగాణలో భూమి ఆక్రమణలతో సంబంధించి కొనసాగుతున్న సవాళ్లను ప్రతిబింబిస్తుంది. న్యాయమూర్తి ఆదేశాలు, ప్రభుత్వ అధికారుల మధ్య బాధ్యతను ప్రాముఖ్యతను తెలియజేస్తున్నాయి. ఈ సంఘటన న్యాయ విషయాల్లో అధికారులు ఎలా బాధ్యత వహించాలి అనే చర్చలను ప్రేరేపించింది.

గాజుల అలంకారంలో కనకదుర్గమ్మ..

కార్తీక శోభతో ఇంద్రకీలాద్రి


- మల్లేశ్వరస్వామి సన్నిధిలో ఆకాశదీపం..

సహస్ర లింగార్చనతో ఆధ్యాత్మిక వైభవం..

- సహస్ర దీపాలంకరణ, ఊయల సేవతో పులకించిన భక్తజనం..

- అమ్మవారి అన్నదానం ట్రస్ట్‌కు రూ.1,00,016 విరాళం





విజయవాడ(ప్రశ్న న్యూస్) కార్తీక మాస పవిత్రతతో ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్తీక శుద్ధ విదియను పురస్కరించుకుని శ్రీ కనకదుర్గమ్మ గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రంగురంగుల గాజులతో అలంకరించిన అమ్మవారి దివ్యమంగళ రూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. కార్తీక మాసంలో అమ్మవారి ప్రత్యేక అలంకార దర్శనం ఇంద్రకీలాద్రిపై భక్తి భావాన్ని మరింత పెంచింది.మరోవైపు శ్రీ మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో కార్తీక మాస ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. ఆకాశదీపం, సహస్ర లింగార్చన, సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. ఆలయ స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛారణలు, సంప్రదాయబద్ధమైన పూజా కార్యక్రమాల మధ్య స్వామివారికి విశేష సేవలు నిర్వహించారు. వేలాది దీపాల వెలుగులతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక కాంతులతో విరాజిల్లింది. ఆకాశదీపం వెలిగించడంతో కార్తీక మాస మహాత్మ్యం ప్రతిబింబించగా, సహస్ర లింగార్చనలో శివనామస్మరణతో ఆలయం మార్మోగింది. సహస్ర దీపాలంకరణ, ఊయల సేవ భక్తులకు కనువిందు చేశాయి.ఈ కార్యక్రమాల్లో దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్ పాల్గొని పూజలు నిర్వహించారు. ట్రస్ట్ బోర్డు సభ్యులు హరికృష్ణ, సుబ్రమణ్య కుమార్, సరిత, పద్మావతి ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి అక్షయ హస్తం.. లక్ష రూపాయలకు పైగా విరాళం..

శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం నిర్వహిస్తున్న అన్నదానం ట్రస్ట్‌కు భక్తులు తమ వంతు సేవా సహకారం అందిస్తున్నారు. విజయవాడ కేదారేశ్వరపేటకు చెందిన బూరగడ్డ అనిత, కే. లక్ష్మణరావు ద్వారా తమ కుటుంబ సభ్యులతో కలిసి రూ.1,00,016 విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ విరాళాన్ని దేవస్థానం ఈవో వి.కె. శీనా నాయక్ స్వీకరించారు. ఈ సందర్భంగా దాతలకు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

దర్శనానికి దివ్యత్వం.. సేవకు దాతృత్వం..

ఒకవైపు అమ్మవారి గాజుల అలంకార దర్శనం.. మరోవైపు మల్లేశ్వరస్వామి సన్నిధిలో కార్తీక ప్రత్యేక పూజలు.. ఇంకోవైపు అన్నదానానికి భక్తుల విరాళాలు.. ఇలా ఇంద్రకీలాద్రిపై భక్తి, ఆధ్యాత్మికత, సేవాభావం మేళవించాయి. కార్తీక మాసంలో దీపారాధన, శివార్చన, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తున్నాయి. భగవంతుడి సన్నిధిలో పూజతో పాటు ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కూడా మహత్తరమైన సేవ అనే సందేశాన్ని ఈ కార్యక్రమాలు చాటిచెప్పాయి.

ప్రత్యేక తనిఖీల్లో మోటార్ వాహన చట్టంకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు

-జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్, ట్రాఫిక్ ఎస్సై మల్లేష్



జగిత్యాల (ప్రశ్న న్యూస్) జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు, జగిత్యాల డీఎస్పీ పురుషోత్తం రెడ్డి సూచనల ప్రకారం, జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఎస్ఐ సిబ్బందితో కలిసి జగిత్యాల పట్టణంలో ప్రత్యేక తనిఖీ కార్యక్రమం నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలు, అలాగే మోటార్ వాహనాల చట్ట నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న వాహనాలను గుర్తించి మొత్తం 150 వాహనాలను అదుపులోకి తీసుకొని, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడం జరిగింది.అనంతరం వాహన యజమానులకు సరైన, ప్రామాణిక నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకోవాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించి కౌన్సెలింగ్ నిర్వహించారు.

పోలీసుల సూచనల మేరకు వాహన యజమానులు స్వచ్ఛందంగా తమ వాహనాలకు ముందు, వెనుక వైపులా నిబంధనలకు అనుగుణంగా కొత్త నంబర్ ప్లేట్లను ఏర్పాటు చేసుకున్నారు.ఈ సందర్భంగా జగిత్యాల పట్టణ సీఐ కరుణాకర్ మాట్లాడుతూ,

ప్రతి వాహనానికి తప్పనిసరిగా నిబంధనల ప్రకారం నిర్దేశించిన ప్రామాణిక నంబర్ ప్లేట్లు ఉండాలని, నంబర్ ప్లేట్లు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్ , ట్రాఫిక్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహిళ భద్రత, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, ర్యాగింగ్‌పై విద్యార్థినులు అవగాహన కలిగి ఉండాలి

- జిల్లా షీ టీమ్స్, ఏ హెచ్ టి యు ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) ఎస్పీ మహేష్ బి. గితే గారి ఆదేశాల మేరకు జిల్లా షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ ఏ హెచ్ టి యు బృందం ఆధ్వర్యంలో విద్యాసంస్థల్లో విద్యార్థినులకు మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా ఈరోజు సిరిసిల్ల పట్టణ పరిధిలోని సహస్ర జూనియర్ కళశాలలో షీ టీమ్, ఏ హెచ్ టి యు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, వాటి వల్ల బాలికల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు , మానవ అక్రమ రవాణాకు సంబంధించిన సమాచరం తెలిస్తే వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు తెలపాలని అధికారులు తెలియజేశారు. బాలికల ,విద్యార్థుల భద్రతకు జిల్లా పోలీస్ శాఖ నిరంతరం పనిచేస్తోందని, పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా, వేధింపులకు గురిచేసినా, ర్యాగింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేధింపులకు గురైన విద్యార్థినులు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీమ్ కి ఫిర్యాదు చేయాలని, బాధితుల వివరాలను గోప్యంగా ఉంచుతూ అవసరమైన రక్షణ, సహాయం అందిస్తామని భరోసా కల్పించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు వివిధ రూపాల్లో జరుగుతున్నాయని, గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, సోషల్ మీడియా పరిచయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకింగ్ సమాచారం ఇతరులతో పంచుకోవద్దని తెలిపారు.

ఈ కార్యక్రమంలో షీ టీం ఏ ఎస్.ఐ ప్రమీల , షీ టీం సిబ్బంది, ఏ హెచ్ టి యుసిబ్బంది పాల్గొన్నారు.

పల్లెబాటలో రేవంత్..
కాళేశ్వరంపై కేసీఆర్‌కు చెక్!

– సంక్రాంతి తర్వాత సీఎం జిల్లాల పర్యటనలు – అసెంబ్లీలో కాళేశ్వరం అస్తం.. కాంగ్రెస్ వ్యూహరచన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సరికొత్త పరిపాలనా వ్యూహాలకు, పొలిటికల్ నెరేటివ్‌కు తెరలేపారు. రాబోయే సంక్రాంతి పండుగ ముగిసిన వెంటనే రాష్ట్రంలోని ప్రతి పల్లెనూ స్వయంగా సందర్శించేలా ప్రజాబలం పేరుతో ఒక భారీ మాస్ కనెక్ట్ కార్యక్రమాన్ని ఆయన సిద్ధం చేసుకున్నారు. కేవలం సచివాలయంలోని ఏసీ గదులు, రివ్యూ మీటింగ్‌ల అధికార దర్పానికి పరిమితం కాకుండా, నేరుగా అట్టడుగు వర్గాల వద్దకు వెళ్లే 'మాస్ లీడర్'గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం మరియు కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో చెక్కుచెదరని విశ్వసనీయతను పెంచడం ఈ పల్లెబాట ప్రధాన లక్ష్యంగా కనిపిస్తోంది.

- క్షేత్ర స్థాయికి వెళ్లి ప్రజా సమస్యలను గుర్తించడం

రేవంత రెడ్డి ప్లాన్ చేసుకున్న ఈ వ్యూహంలో రెండు స్పష్టమైన పొలిటికల్ యాంగిల్స్ ఉన్నాయి. మొదటిది – క్షేత్రస్థాయికి వెళ్లి ప్రజా అవసరాలను నేరుగా తెలుసుకోవడం మరియు ఎల్‌నినో ప్రభావంతో తలెత్తిన తాగు, సాగునీటి పర్యవేక్షణపై చర్యలు తీసుకోవడం ద్వారా సమ్మేళన సంక్షేమ ముద్రను సాధించడం. ఇక రెండవది, అత్యంత కీలకమైనది – శాసనసభ వేదికగా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, మేడిగడ్డ బ్యారేజీ డిజైన్ లోపాలను ఆధారాలతో సహా ఎండగట్టడం ద్వారా కేసీఆర్ నిర్మించుకున్న 'నీటిపారుదల రథసారథి' బ్రాండ్ ఇమేజ్‌ను శాశ్వతంగా బద్దలు కొట్టడం. కేసీఆర్ బ్రాండ్‌ను దెబ్బతీసేందుకు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల వేదికను సిద్ధం చేస్తున్న రేవంత్ ప్రత్యక్ష సభ ద్వారా కాళేశ్వరం నిర్మాణంలో జరిగిన ఆర్థిక, సాంకేతిక లోపాలను ప్రజాక్షేత్రంలో పెట్టాలని భావిస్తున్నారు. బిఆర్ఎస్ తమ హయాంలో సాధించిన అతిపెద్ద విజయంగా చెప్పుకునే కాళేశ్వరాన్ని వైఫల్యాల కాళేశ్వరం గా మార్చడం ద్వారా ప్రతిపక్షాల విమర్శల దాడికి మూలాల్లోనే గండికొట్టాలనేది తాడేపల్లి–హైదరాబాద్ పొలిటికల్ డిజైన్. అసెంబ్లీలో కేసీఆర్ మార్క్ ప్రాజెక్టుల గుట్టు విప్పి, పల్లెల్లో ప్రజాబలం ద్వారా ప్రజలను మమేకం చేయడం ఈ రెంటెడ్ వ్యూహం.

- కేడర్‌ను ఎన్నికలకు సిద్ధం చేసే ప్లాన్

అదే సమయంలో, పల్లెబాట ద్వారా కాంగ్రెస్ పార్టీ అంతర్గత సమీకరణాలను చక్కదిద్దే దిశగా కూడా అడుగులు పడుతున్నాయి. మంత్రివర్గంలో లేదా క్షేత్రస్థాయిలో ఉన్న చిన్నపాటి అసమ్మతి సెగలను అణచివేయడానికి, కేడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపడానికి ఈ పల్లెబాట ఒక పొలిటికల్ ఎనర్జీ బూస్టర్‌లా పనిచేయనుంది.

స్థానిక సంస్థలు మరియు భవిష్యత్ ఎన్నికల దిశగా పార్టీ యంత్రాంగాన్ని సన్నద్ధం చేయాలంటే స్వయంగా ముఖ్యమంత్రి గ్రౌండ్‌లోకి దిగి పర్యటించడం కంటే వేరే మార్గం లేదు. కేటీఆర్, హరీష్ రావు వంటి బిఆర్ఎస్ అగ్రనేతలు ప్రభుత్వంపై పదే పదే చేస్తున్న దాడిని ఎదుర్కొనేందుకు రేవంత్ రెడ్డి ఎంచుకున్న ఈ 'డ్యూయల్ ఆపరేషన్' కాంగ్రెస్ పార్టీకి గట్టి రక్షణ కవచంగా మారనుంది.

సచివాలయ పరిపాలనకు, గ్రామీణ ప్రజాక్షేత్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించడం ద్వారా ప్రజలు తమకు ఇబ్బంది వచ్చినప్పుడు ఆదుకునే నేతగా రేవంత్‌ను చూసే వాతావరణాన్ని కల్పించేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.

- సంక్రాంతి తర్వాత అసలు రాజకీయం

సంక్రాంతి తర్వాత ప్రారంభం కానున్న 'ప్రజాబలం' పల్లెబాట తెలంగాణ రాజకీయాల్లో ఒక పెద్ద టర్నింగ్ పాయింట్‌గా మారే అవకాశాలు ఉన్నాయి.

ఒకవైపు అసెంబ్లీ వేదికగా కాళేశ్వరంపై బీఆర్ఎస్ నెరేటివ్‌ను తిరగరాయడం, మరోవైపు పల్లెల్లో శ్రేణులను ఏకం చేస్తూ ప్రజామోదాన్ని పెంచుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి తెలంగాణలో తన రాజకీయ స్థానాన్ని మరింత తిరుగులేనిదిగా మార్చుకోవడానికి సుదీర్ఘమైన స్కెచ్ వేశారు.

కపిలేశ్వరాలయంలో
హోమ మహోత్సవాలకు శ్రీకారం

- గణపతి హోమంతో కార్తీక మాస వేడుకలు ప్రారంభం

- నెల రోజుల పాటు విశేష పూజలు, హోమాలు

- నేటి నుంచి రెండు రోజుల పాటు సుబ్రహ్మణ్యస్వామి హోమం



తిరుపతి(ప్రశ్న న్యూస్) కార్తీక మాసాన్ని పురస్కరించుకుని తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో నెల రోజుల పాటు నిర్వహించనున్న విశేషపూజ హోమ మహోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు విఘ్నవినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి గణపతి హోమంతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.ఉదయం ఆలయంలోని పంచమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, విభూతితో విశేష స్నపన తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం గణపతి పూజ, పుణ్యాహవచనం, వాస్తు పూజ, పర్యగ్నీకరణం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, కలశస్థాపన, అగ్నిప్రతిష్ఠ వంటి వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గణపతి హోమం, లఘుపూర్ణాహుతి సమర్పించారు.విఘ్నవినాయకుడి అనుగ్రహంతో విఘ్నాలు తొలగి, సర్వకార్యాలు విజయవంతం కావాలనే సంకల్పంతో హోమాన్ని నిర్వహించారు. కార్తీక మాసమంతా వివిధ దేవతామూర్తులకు ప్రత్యేక హోమాలు, పూజా కార్యక్రమాలు కొనసాగనున్నాయి.

నేటి నుంచి సుబ్రహ్మణ్యస్వామి హోమం..

మహోత్సవాల్లో భాగంగా నవంబరు 12, 13 తేదీల్లో శ్రీ సుబ్రహ్మణ్యస్వామివారి హోమాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డెప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో కుమారి దేవి, సూపరింటెండెంట్ చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బడిలో బరితెగించిన నిర్లక్ష్యం

- వెంగళరావు నగర్ ప్రభుత్వ పాఠశాల

- విద్యాలయమా? వేధింపుల నిలయమా.?

- చదువుకోవాల్సిన చిన్నారులతో మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్నారన్న ఆరోపణలు

- ఆరుగురు వాచ్‌మెన్లు ఉన్నా పారిశుధ్యం అధ్వానం.. ఇద్దరితోనే పనులా

- మధ్యాహ్న భోజనంపై తీవ్ర అసంతృప్తి

- ఇంటి క్యారేజీలకూ గేటు వద్ద అడ్డంకులా

- ఫుడ్ కమిటీ ఏం చేస్తోంది.? విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ ఏమైంది



గుంటూరు(ప్రశ్న న్యూస్) ప్రభుత్వ పాఠశాలలు పేద విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాల్సిన విద్యా దేవాలయాలు. అక్షరజ్ఞానంతో పాటు క్రమశిక్షణ, సంస్కారం, ఆత్మవిశ్వాసం నేర్పాల్సిన పవిత్ర ప్రాంగణాలు. కానీ గుంటూరు నగరంలోని వెంగళరావు నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వెలుగుచూస్తున్నాయన్న ఆరోపణలు మాత్రం ఈ వ్యవస్థ పరువునే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. పుస్తకాలు పట్టుకుని బంగారు భవిష్యత్తు వైపు అడుగులు వేయాల్సిన చిన్నారుల చేతుల్లో చీపుర్లు, బాత్రూం బ్రష్‌లు పెట్టి మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్నారన్న ఫిర్యాదులు కలకలం రేపుతున్నాయి. మరోవైపు మధ్యాహ్న భోజనం నాణ్యతపై విద్యార్థులు, తల్లిదండ్రుల అసంతృప్తి.. ఇంటి నుంచి తెచ్చుకున్న క్యారేజీలను సైతం గేటు వద్దే అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు పరిస్థితిని మరింత తీవ్రం చేస్తున్నాయి. ఆరుగురు వాచ్‌మెన్లు ఉన్నా పాఠశాలలో పారిశుధ్యం ప్రశ్నార్థకంగా మారిందంటే నిర్వహణ ఎంత అధ్వానంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అసలు పాఠశాలలో జరుగుతున్నదేమిటి? బాధ్యత వహించాల్సిన సిబ్బంది ఏం చేస్తున్నారు? పర్యవేక్షించాల్సిన అధికారులు ఎక్కడున్నారు? అన్న ప్రశ్నలు ఇప్పుడు తల్లిదండ్రులను వేధిస్తున్నాయి.

చదువుల బడిలో చీపుర్ల రాజ్యం..

విద్యార్థులు తరగతి గదుల్లో పాఠాలు నేర్చుకోవాల్సిన సమయంలో వారితో మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్నారన్న ఆరోపణలు అత్యంత తీవ్రమైనవి. కొందరు విద్యార్థులను మోకాళ్లపై కూర్చోబెట్టి బాత్రూంలు కడిగిస్తున్నారని, చీపుర్లు, బ్రష్‌లు, శుభ్రపరిచే రసాయనాలతో పనులు చేయిస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మాట వినకపోతే హాజరు వేయబోమని, టీసీ ఇచ్చి పంపిస్తామని బెదిరిస్తున్నారన్న ఫిర్యాదులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే అది సాధారణ నిర్వహణ లోపం కాదు.. విద్యార్థుల ఆత్మగౌరవం, భద్రత, బాలల హక్కులకు సంబంధించిన తీవ్రమైన అంశం. పిల్లలను బడికి పంపేది చదువు నేర్చుకోవడానికి కానీ పారిశుధ్య పనులు చేయడానికి కాదు. విద్యార్థులతో మరుగుదొడ్లు శుభ్రం చేయించే అధికారం ఎవరిచ్చారు? ఈ దుస్థితికి బాధ్యులెవరు? పాఠశాల యాజమాన్యం సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

ఆరుగురు వాచ్‌మెన్లు.. అయిన కంపుకొడుతున్న వైనం..

పాఠశాలలో ఆరుగురు వాచ్‌మెన్లు ఉన్నట్లు చెబుతున్నా పారిశుధ్య నిర్వహణ మాత్రం గాడిన పడటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వారిలో ఇద్దరికే క్లీనింగ్ బాధ్యతలు అప్పగించామని చెబుతున్నట్లు సమాచారం. మరి మిగిలిన నలుగురి విధులేమిటి? వారు ఏ పనులు చేస్తున్నారు? వారి హాజరు, విధుల నిర్వహణను పర్యవేక్షిస్తున్న అధికారులు ఎవరు? సిబ్బందికి వేతనాల రూపంలో ప్రజాధనం వెచ్చిస్తున్నప్పుడు పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచలేని పరిస్థితి ఎందుకు ఏర్పడింది? సిబ్బంది అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థులతోనే శుభ్రపరిచే పనులు చేయిస్తున్నారన్న ఆరోపణలు నిజమైతే బాధ్యతారాహిత్యానికి ఇంతకంటే నిదర్శనం ఏముంటుంది? వాచ్‌మెన్ల హాజరు పట్టికలు, విధుల కేటాయింపు, పారిశుధ్య పనుల నిర్వహణపై ఉన్నతాధికారులు తనిఖీ చేయాల్సిందే.

మధ్యాహ్న భోజనమా.. ఆకలి మీద ప్రయోగమా..

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాల్సిన మధ్యాహ్న భోజన పథకంపైనా తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. భోజనం నాణ్యతగా ఉండటం లేదని, తినడానికి ఇబ్బందిగా ఉంటోందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నట్లు సమాచారం. పేద కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో అమలవుతున్న పథకం పాఠశాల స్థాయిలోనే విమర్శలకు గురవడం దురదృష్టకరం. భోజనం తినలేక కొందరు విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారని, వాటిని సైతం పాఠశాల గేటు వద్దే అడ్డుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో అందించే భోజనం నాణ్యతపై అభ్యంతరాలుంటే వాటిని పరిష్కరించాల్సింది పోయి ఇంటి నుంచి తెచ్చుకున్న ఆహారాన్నీ అనుమతించకపోవడం వెనుక కారణమేంటి? పిల్లల ఆకలి కంటే నిబంధనలే ముఖ్యమా? విద్యార్థుల ఆరోగ్యం, ఆహార భద్రతకు ఎవరు బాధ్యత వహిస్తారు?

ఫుడ్ కమిటీ నిద్రపోతోందా..

మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిమాణం, పరిశుభ్రత, మెనూ అమలును పర్యవేక్షించాల్సిన ఫుడ్ కమిటీ పనితీరుపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీలు నిర్వహించి లోపాలను గుర్తించాల్సిన కమిటీ సభ్యులే వంట ప్రక్రియలో ప్రత్యక్షంగా జోక్యం చేసుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆహార పదార్థాల నాణ్యతను ఎవరు పరిశీలిస్తున్నారు? వంటశాల పరిశుభ్రతను ఎవరు తనిఖీ



చేస్తున్నారు? రోజువారీ మెనూ అమలవుతోందా? ఆహార నమూనాలను భద్రపరుస్తున్నారా? విద్యార్థుల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారా? రికార్డుల్లో తనిఖీలు చేసినట్లు చూపించి క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదా? అన్న ప్రశ్నలకు సమాధానాలు రావాల్సి ఉంది.

అధికారుల పర్యవేక్షణ ఎక్కడ..

ఒక ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల చేత మరుగుదొడ్లు శుభ్రం చేయిస్తున్నారన్న ఆరోపణలు, భోజనంపై ఫిర్యాదులు, పారిశుధ్య లోపాలు ఒకేసారి వెలుగులోకి వస్తున్నా విద్యాశాఖ యంత్రాంగం ఏం చేస్తోంది? మండల విద్యాశాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాల్సిన బాధ్యత లేదా? పాఠశాల నిర్వహణపై నివేదికలు తీసుకోవడం మాత్రమే పర్యవేక్షణ అవుతుందా? విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్న సందర్భాలున్నాయా? ఆకస్మిక తనిఖీలు జరిగి ఉంటే ఇలాంటి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయి? అధికారుల తనిఖీలు కేవలం రికార్డులకే పరిమితమవుతున్నాయన్న అనుమానాలకు ఈ పరిణామాలు తావిస్తున్నాయి.

కలెక్టర్ జోక్యం చేసుకోవాలి.. బాధ్యులపై చర్యలు తప్పవు..

జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు ఈ వ్యవహారాన్ని తేలిగ్గా తీసుకోకూడదు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి. విద్యార్థులతో ఉపాధ్యాయులు, సిబ్బంది సమక్షం లేకుండా స్వేచ్ఛగా మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలి. తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు స్వీకరించాలి. మరుగుదొడ్ల శుభ్రతకు విద్యార్థులను వినియోగిస్తున్నారన్న ఆరోపణలపై విచారణ జరపాలి. ఆరుగురు వాచ్‌మెన్ల హాజరు, విధుల కేటాయింపు, పారిశుధ్య నిర్వహణ, మధ్యాహ్న భోజనం నాణ్యత, ఫుడ్ కమిటీ రికార్డులు, ఇంటి నుంచి తెచ్చుకునే ఆహారంపై విధిస్తున్న ఆంక్షల వెనుక కారణాలను పరిశీలించాలి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. అవసరమైతే సంబంధిత చట్టాల ప్రకారం చర్యలు చేపట్టాలి.

భక్తుల అభిప్రాయమే
టీటీడీ సేవలకు ప్రామాణికం

- ఫిర్యాదుల పరిష్కారంపై అదనపు ఈవో ప్రత్యేక దృష్టి

- నందకం యాప్‌లో సమస్యలకు 24 గంటల్లోనే పరిష్కారం

- వసతి సముదాయాల్లో పరిశుభ్రత, మౌలిక వసతుల మెరుగుదలకు ఆదేశాలు



తిరుమల(ప్రశ్న న్యూస్) కలియుగ వైకుంఠం తిరుమలకు వచ్చే భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా టీటీడీ అడుగులు వేస్తోంది. భక్తుల అభిప్రాయాలు, సూచనలు, ఫిర్యాదులను సేవల నాణ్యతకు కొలమానంగా తీసుకుని అవసరమైన మార్పులు చేపట్టాలని టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి అధికారులకు సూచించారు.తిరుమలలోని పద్మావతి అతిథి గృహం సుధర్మ సమావేశ మందిరంలో బుధవారం ఉదయం టీటీడీ అభిప్రాయ సేకరణ వ్యవస్థ పనితీరుపై ఆయన సమీక్ష నిర్వహించారు. భక్తుల నుంచి అందుతున్న అభిప్రాయాలు, ఫిర్యాదుల పరిష్కారంలో జరుగుతున్న పురోగతిని పరిశీలించారు. భక్తుల సంతృప్తే ప్రధాన లక్ష్యంగా విభాగాలన్నీ సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

సేవల్లో పారదర్శకత.. సౌకర్యాల్లో నాణ్యత

అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక రిసెప్షన్ కౌంటర్ ఏర్పాటు చేయాలని అదనపు ఈవో సూచించారు. వసతి సముదాయాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించేలా భక్తుల్లో అవగాహన కల్పించాలని, విలువైన వనరులు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

నందకం యాప్‌పై నిత్యం నిఘా..

భక్తులకు సేవలందించే నందకం యాప్ పనితీరును ప్రతిరోజూ నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే 24 గంటల్లోపు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. లగేజీ కౌంటర్ల వద్ద భక్తుల భద్రత, సౌకర్యాల కోసం సీసీటీవీ కెమెరాలు, ఫిర్యాదుల పెట్టెలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.భక్తుల నుంచి వచ్చే ప్రతి సూచనను విలువైనదిగా పరిగణించి, ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అదనపు ఈవో స్పష్టం చేశారు. భక్తుల విశ్వాసానికి అనుగుణంగా సేవల ప్రమాణాలను మరింత పెంచేందుకు అధికారులు నిరంతరం కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో టీటీడీ వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్‌ను కలిసిన
ఏలూరు మేయర్ రెడ్డి అప్పలనాయుడు

- కుటుంబ సభ్యులు, జనసేన నేతలతో మంగళగిరి క్యాంపు కార్యాలయానికి

- మర్యాదపూర్వక భేటీ.. ఉప ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు



మంగళగిరి(ప్రశ్న న్యూస్) ఏలూరు మేయర్‌గా ఎన్నికైన జనసేన పార్టీ నాయకుడు రెడ్డి అప్పలనాయుడు ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. మంగళగిరిలోని పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన భేటీ అయ్యారు.ఈ సందర్భంగా మేయర్‌గా ఎన్నికైన నేపథ్యంలో తనకు అందించిన సహకారం, ప్రోత్సాహానికి పవన్ కల్యాణ్‌కు రెడ్డి అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలియజేశారు. కుటుంబ సభ్యులతో కలిసి ఉప ముఖ్యమంత్రిని కలుసుకుని ఆశీస్సులు తీసుకున్నారు. పార్టీ నాయకులు కూడా ఈ భేటీలో పాల్గొన్నారు.ఏలూరు నగర మేయర్‌గా ఎన్నికైన అనంతరం పవన్ కల్యాణ్‌ను కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588